


# శ్రీ నాన్న ఉవాచ

# శ్రీ నాన్న ఉవాచ




డా॥ కె. రామారావు

శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - 534 265

# శ్రీ నాన్న ఉవాచ

ముద్రణ : డిసెంబర్, 2016

**ఈ సృష్టిలో ఎంగిలి కానిది**

**"ఆత్మ" ఒక్కటే !**

వెల : రూ|| 20/-

# వింటారా నా మాట?

పేదలే పెన్నిధులనుకొని, దీనులే దేవుళ్ళు అనుకొని, ఆర్తులే ఆప్తులనుకొని, పీడితులే పరమాత్మ అనుకొని 10 సంవత్సరాలు పని పనికోసమే చేసాను. చివరికి విధి వంచితుడనై, నేను నమ్మిన ఆశయాలు వమ్మై, నేను దైవంగా భావించిన సమాజమే నన్ను ద్వేషిస్తుంటే - చేసేది లేక, వృత్తికి స్వస్తి చెప్పి, కర్తవ్యం తెలియక ఖిన్నుడనై, మిన్నకున్న తరుణంలో ఒక మిత్రుడు తారసిల్లి "జిన్నూరులో ఓ రాజుగారు ఉన్నారు. ఆయన మంచి భక్తులు. చక్కని సలహాలు చెప్తారు, ఆయనను కలుసుకోండి. మీ మనస్సు కుదుటపడుతుంది" అని సలహా చెప్పారు.

1984 ఏప్రియల్ 19న ఆ మహనీయుడిని దర్శించాను. "రాజుగారూ, నేను నమ్మిన ఆశయాల కోసము నా జీవితాన్ని అంకితము చేసి, అయిన వారందరికీ దూరమయ్యాను, నేను నమ్మిన ఆశయాలు - నాకు గాని, నా వారికి గాని, నేను ప్రేమించే సమాజానికి గాని సంతృప్తిని యివ్వలేదు. నా ఆశయాలే నన్ను గేలిచేస్తున్నాయి - అవమానము వేధిస్తున్నది - ఆవేదన కృంగదీస్తున్నది - ఆలోచన జరిగిన దానిని మరచిపోయి, సమాజానికి దూరంగా, ఏకాంతంలో ప్రశాంతముగా బ్రతక

మంటున్నది. ఏది మంచో - ఏది చెడో నేను నిర్ణయించు కోలేకపోతున్నాను. అందుకే మీ సలహా కోరి వచ్చాను. మీరు ఏ దారిన నడవమంటే - అది నాకు యిష్టము లేకపోయినా, కష్టమైనప్పటికీ ఆచరించటానికి సిద్ధముగా ఉన్నాను" అని నా పరిస్థితిని వివరించాను.

ఆయన కాసేపు నా ముఖములోనికి ప్రశాంతము గా చూసారు. మీకు మంచి రోజులు వస్తాయి, అభివృద్ధి లోనికి వస్తారు, ప్రస్తుతము మీరు ఇప్పడు చేస్తున్న వృత్తిని విడిచిపెట్టకండి, కొద్ది రోజులలో మీ హృదయములో నుంచే మీకు ఆదేశాలు వస్తాయి. వాటిని మీరు ఆచరించండి" అని చెప్పి భగవాన్ శ్రీరమణ మహర్షి జీవిత చరిత్రను నాకు ఇచ్చి పంపివేసారు.

అప్పటికి నాకు ఆత్మ అంటే తెలియదు. గురువు అంటే తెలియదు. జ్ఞాని దర్శనం ఊరికేపోదని - అది మనలను పునీతులను చేస్తుందని కూడా నాకు తెలియదు. ఆ మహనీయుని దర్శన భాగ్యమే ఈ నాటి ఈ ఐశ్వర్యాన్ని నాకు యిస్తుందని ఆనాడు నాకు తెలియదు.

అది ఆయన కరుణ కాకపోతే వారము రోజులు తిరగకుండానే మరల జిన్నూరు వస్తానా? ఏప్రియల్ 24 రాత్రి 9 గంటలకు నేను రెండవసారి జిన్నూరు వెళ్ళేటప్పటికి

ఆయన ఒక్కరే ఒంటరిగా అరుగుమీద కూర్చుని ఉన్నారు. "రాజుగారు, 'నాది' అనే భావన పోయి, నేను 'నేను'గా ఒంటరిగా మిగిలిపోవాలని ఉంది. అప్పటివరకు నాకు శాంతి కనిపించుటలేదు" అని చెప్పాను.

ఒక్కసారి ఆయన కళ్ళు మెరుపులా మెరిసాయి. మరల చెప్పమన్నారు - చెప్పాను. మరల చెప్పమన్నారు - చెప్పాను. అంతే! ఆ కళ్ళు రెప్పవాల్చకుండా నా కళ్ళలోకి చూస్తూ నిలబడిపోయాయి. ఆ కళ్ళు మామూలు కళ్ళు కాదు. ఆ చూపు మామూలు చూపు కాదు. ఎక్కడో అంతరాంతరాళములోనుంచి వచ్చి నా హృదయాంతరాళములోనికి చూస్తున్నది ఆ చూపు! ఎంతో ప్రశాంతత, ప్రేమ పొంగి పొరలుతున్నది ఆ చూపులో! బండరాళ్ళు కూడా కరిగిపోతాయి అనిపిస్తున్నది - ఆ ప్రేమకు! మా చుట్టూ గంభీర మౌనము ఆవరించినది. ఆ చూపుల కాంతిలో, శాంతిలో నేను కాలాన్నే మరచిపోయాను. గంట కాలము గడిచిపోయినది. ఆ గంటే నా జీవితములో జేగంట మ్రోగిన ఘడియ అని, ఆ రోజే నా జన్మకు జీవము పోసిన రోజని అప్పడు నాకు తెలియదు. మౌనము మాటలాడుతుందని, జ్ఞానాన్ని బోధిస్తుందని, అమృతాన్ని వర్షిస్తుందని నేను ఎప్పడూ ఊహించలేదు. కాని అది నా ఊహకు అందిన తరువాత నా హృదయములోనుంచి కృతజ్ఞతతో

కన్నీరు పొంగిపొరలినది.

గంభీర మౌనాన్ని ఛేదించుకొని, ఎక్కడో హృదయపు లోతులలోనుంచి వస్తున్న ఒకమాట నాకు వినిపించినది - "ఈ వెంకట్రామరాజే వచ్చి భవిష్యత్తులో మీ కళ్ళముందు నిలుచుంటే - కన్నెత్తి చూడటంకూడా మీకు భారమనిపించవచ్చును డాక్టరు గారూ" అని అన్నారు.

కృతజ్ఞతతో పరితపిస్తున్న నా మనస్సు ఒకసారి తుళ్ళిపడి "నేను అంత కృతఘ్నుడను అవుతానంటారా?" అని అడిగాను.

"మీకంటే వేరొక వస్తువు ఉంటే మీరు చూస్తారు. కాని, అంతటా ఉన్నది మీరే అయినప్పుడు మీరు దేనిని చూస్తారు?" అని ప్రశ్నించారు.

మీరు అంటున్నదే నిజమైతే, ఆ మహోన్నత స్థితినే గనుక నేను పొందితే, ఆ స్థితికి దారి చూపుతున్న మీపట్ల నాకు కృతజ్ఞత ఉండాలి కదా?" అని అన్నాను.

"కృతజ్ఞత ఉన్నప్పటికీ - ఒక్కసారి అద్వైత సుఖాన్ని రుచి చూసాక, ఆ ఆత్మ శాంతిలో మునిగాక, ద్వైత దృష్టి ఎంత కష్టమో మీకు చెపుతున్నాను" అని అన్నారు ప్రేమతో!

ఆ మాటల బరువు, వాటిలోతు ఆనాడు నాకు తెలియదు. ఏదో అవ్యక్తమైన అనుభూతి నన్ను

ఆవరించినది. ఆ మధుర అనుభూతిలో దినమొక క్షణములా కాలము గడిచిపోతున్నది.

ఒకనాటి రాత్రి నా గతజన్మ స్మృతులను గుర్తుచేసే ఒక మధురమైన స్వప్నము వచ్చినది. ఆ స్వప్నములో ఆ మహనీయునితో నాకున్న గత జన్మ సంబంధము అర్థమైనది. ఈ స్వప్నము రాకముందు అందరు భక్తులు లాగ ఆయనను "నాన్నగారు" అని పిలవాలని నాకు అనిపించలేదు - కాని స్వప్నము వచ్చిన తరువాత మాత్రము ఆయనను "నాన్నగారూ" అని దిక్కులు దద్దరిల్లేలా అరవాలనిపించినది. మా గతజన్మ సంబంధమట్టిది!

కొద్ది రోజులు గతించిన తరువాత శ్రీ నాన్నగారి మాటలు ఉన్న కేసెట్టును ఒక సోదరుడు నాకు ఇచ్చారు. శ్రీ నాన్నగారి మాటలు వింటున్నాను, అందులో కొన్ని మాటలు నా గుండెను కుదిపివేసాయి, నా హృదయాన్ని దొలిచివేసాయి. "మీరు జన్మించినది మొదలు మీ స్వార్థము కోసమే పరితపిస్తున్నారు గాని; పరమార్థము కోసము మీ జీవితములో ఎంతకాలము ఖర్చుపెట్టారు? ఆవేశము తగ్గించుకొని ఆలోచన పెంచుకోండి. మీ ఆస్తులు, మీ బంధువులు, మీ స్నేహితులు చివరికి మీ శరీరాలు కూడా మరణానంతరము మీ కూడా రావు. కాని

మీ గురువు మాత్రము మీకు జ్ఞానము కలిగేవరకు, మీ స్వరూపముగా ఆయన మీకు దర్శనమిచ్చేవరకు మిమ్ములను విడిచిపెట్టడు" అని చెప్పిన ఉపదేశం విన్నాను.

ఆ సందేశము నాకు సత్యమనిపించినది. మన స్వార్థం కోసము ఎన్నో బాధలు భరిస్తున్నాము. బాధ్యతలు మోస్తున్నాము - మరి దైవమును తెలుసుకొనుటకు - శారీరకముగా గాని, మానసికముగా గాని, వేదన అనుభవించుటకు సిద్ధముగా ఉన్నామా? దైవము కోసము శిక్షను శిక్షణగా మలచుకొనుట నేర్చుకోగలమా? 20 సంవత్సరములు వెనుకకుపోతే ఈ భార్యలేదు కదా, 40 సంవత్సరములు వెనుకకు పోతే నా అమ్మ-నాన్న ఎవరు? నా భార్యబిడ్డలు ఎవరు? మరో 60 సంవత్సరములు ముందుకు పోతే ఎవరు ఉంటారో - ఎవరు పోతారో!? అమ్మ చనిపోతే నేను చూడగలనా, భార్య చనిపోతే నేను భరించగలనా? అమ్మో! ఆ రోజును ఊహించుకుంటేనే నా గుండె బ్రద్దలౌతుంది. మరి బయటపడాలంటే ఏమిటి దారి? అహంకారమును సంతృప్తిపరచుకుంటూ జీవించుటకంటే - సద్గురువును ఆశ్రయించి, అహంకార రహిత స్థితిని చేరుకొనుటకు ప్రయత్నము చేయుట మంచిదనిపించినది. మరి ఆ సద్గురువు ఎక్కడ దొరుకుతాడు?

తళుక్కున మెరుపులా నాకు ఒక తలపు తట్టినది. "ఇన్నాళ్ళుగా లోకము వైపు పరుగెడుతున్న నా మనస్సు ఇప్పుడు ఎందుకు ఇలా వెనుతిరిగి వస్తున్నది? ఈ ఆలోచనలు అన్నీ ఎందుకు వస్తున్నాయి? ఆ మహనీయుని మాటలు వినబట్టేగదా? అయితే ఆయనే నాకు గురువు, సత్యాన్ని గుర్తుచేసి, తెలియచెప్పగలవాడే గురువు. గుర్తించే హృదయము లేక ఇన్నాళ్ళూ, కళ్ళు ఉండి కూడా చూడలేకపోయాను."

అంతే! ఆ రోజు నుండి శ్రీ నాన్నగారితో నా జీవితాన్ని ముడిపెట్టుకున్నాను. స్మరించుట మొదలు పెట్టాను. ప్రేమించుట నేర్చుకున్నాను. ఆ ప్రేమ నా దుఃఖాన్ని ఆర్పివేసినది. నా జీవితములో ఎంతో వెలుగును నింపినది. సంవత్సరము తిరగకుండానే ఆయన పాదాల చెంతకు నన్ను చేర్చినది! మహిమలు చేసినవాడు గురువని మనము అనుకుంటాము. మరి మన మనస్సును మార్చుటకంటే మించిన మహిమ మరొకటి ఉందా?

నేటి సమాజములో ఏది మంచో, ఏది చెడో కూడా తెలియని అజ్ఞానము విలయ తాండవము చేస్తున్నది. అర్థకామములను లక్ష్యముగా పెట్టుకొని జీవిస్తే అశాంతి మిగులుతుంది. నిత్యమైన, స్వచ్ఛమైన సుఖమును, శాంతిని అనుభవించుటకు ఆత్మ జ్ఞాన

సముపార్జన అత్యంత అవసరము. అనర్థములు తీసుకువచ్చే అర్థము కోసము జీవించుటయా - లేక పరమార్థమును పొందుటకు పాటుపడుటయా - ఏది నిజమైన జీవితం?


నిజానికి మనమందరమూ మాయనే కేంద్రముగా పెట్టుకొని జీవిస్తూ, జ్ఞానగంగకు దూరమైపోయాము. వాపును చూచి బలమనుకుంటున్నాము. సత్యాన్వేషకుడికి ఏదో ఒక రోజున ఈ వాపులన్నీ కరిగిపోతాయి. భ్రమలన్నీ తొలగిపోతాయి. చివరకు మిగిలేది ఆత్మ ఒక్కటే! ఆ ఆత్మ కోసము ఎవడైతే జీవిస్తున్నాడో, ఆ సత్యము కోసము ఎవడైతే అన్వేషిస్తున్నాడో, ఆ జ్ఞానము కోసము ఎవడైతే తన దేహాన్ని, ధనాన్ని, కాలాన్ని ఖర్చుపెడుతున్నాడో - వాడు మాత్రమే జీవించినట్లు - అదే నిజమైన జీవితం!

ఇరుకు మనస్సుతో జీవిస్తున్నంత కాలమూ అనంత స్థితి అందదు. సత్యమును మనము నమ్మాలిగాని - మనము నమ్మేది అంతా సత్యము కాదు. సత్యసాక్షాత్కారమునకు దైవకృప, శాస్త్రకృప, గురుకృప అవసరము.

ఇకనైనా అజ్ఞానములోనుంచి మేల్కొనండి. మాయలోనుంచి బయటపడండి. మీ మనస్సును విశాలము చేసుకోండి. మీ బుద్ధికి పదును పెట్టండి. మీ వివేకాన్ని ఉపయోగించుకొని, మీ వైరాగ్యాన్ని పెంచుకొని,

మీ హృదయపు లోతుల్లోనికి దిగండి. ఏది సత్యమని, ఏది సర్వోత్కృష్టమని మన శాస్త్రములు చాటుతున్నాయో - ఆ పరమార్థాన్ని అందుకోవటానికి ప్రయత్నము చేయండి. మన స్వరూపమైన ఆత్మ స్థితిని, అమృత స్థితిని, ఆనంద స్థితిని అందుకొనుటకు మీ శేష జీవితాలను ఖర్చు పెట్టండి. సత్యాన్వేషణలో సహకరించుటకు మన తండ్రి మన కోసము ఎదురు చూస్తున్నాడు. సత్పురుష సహవాసము సాధనలతో నిమిత్తము లేకుండానే సంస్కారములను దహించి స్వరూప సుఖాన్ని ప్రసాదిస్తుంది. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొనుటకు మీరు కూడా నాతో వస్తారా?

– డా॥ కె. రామారావు



# జీవిత సంగ్రహము

శ్రీ నాన్నగారు పశ్చిమగోదావరి జిల్లా జిన్నూరు వాస్తవ్యులు. భూపతిరాజు వెంకట లక్ష్మీనరసింహరాజు నామధేయులు. శ్రీ నాన్నగారు మాతామహుల స్వస్థలమైన కొమ్మర గ్రామములో 1934 సెప్టెంబరు 23వ తేదీ పౌర్ణమి ఆదివారము జన్మించారు. తల్లి రాజయమ్మ, తండ్రి సూర్య నారాయణరాజు. శ్రీ నాన్నగారి చిన్నతనములోనే తండ్రి మరణించారు. పూర్వమునుండి వీరిది ఆధ్యాత్మిక చింతన గల కుటుంబము. అందుకే బాల్యములోనే శ్రీ నాన్నగారి హృదయములో భక్తి బీజము పడినది. 1954 మార్చిలో వారి అమ్మమ్మగారితో కలసి ఉత్తరదేశములోని పుణ్య క్షేత్రములను దర్శించినారు. ఋషికేష్‌లోని స్వామి శివానంద "బి గుడ్ అండ్ డు గుడ్" అని శ్రీ నాన్నగారిని ఆశీర్వదించారు. ఆ యాత్రలో శ్రీ నాన్నగారు కాశీలో తొమ్మిది రోజులు ఉన్నారు. కాశీలోనున్న ఆకొద్ది రోజులలోనే ఆయన హృదయములోనున్న భక్తి భావన వికసించినది.

1957లో శ్రీ నాన్నగార్కి ఒక స్వప్నము వచ్చినది. ఆ స్వప్నములో ఒక ముసలి వ్యక్తి దర్శనమిచ్చి, శ్రీ నాన్నగారి కుడి బుగ్గమీద మూడుసార్లు ముద్దు పెట్టుకున్నారు. ఆ స్వప్నములో దర్శనమిచ్చిన పుణ్యపురుషుడు మరెవరో

కాదు - మరుగున పడిపోతున్న జ్ఞానమార్గాన్ని పునరుద్ధరించి, ఆత్మను దర్శించటానికి "నేనెవడను?" అను విచారణ పద్ధతిని బోధించి, ఆధ్యాత్మిక రంగంలో ఒక నూతన విప్లవాన్ని తీసుకువచ్చి - నవయుగానికి నాంది పల్కిన అవతార పురుషుడు భగవాన్ శ్రీ రమణ మహర్షుల వారు.

భగవాన్ శ్రీ రమణ మహర్షి 1879 డిసెంబరు 29 రాత్రి ఒంటి గంటకు తిరుచ్చుళిలో అళగమ్మ గర్భాన కాంతి రూపమున బయటకు వచ్చి, మధుర క్షేత్రములో మృత్యానుభవముతో మోక్షాన్ని పొంది, అరుణాచల క్షేత్రములో జ్ఞానాన్ని బోధించి, లోకానికి వెలుగును చూపించి, మరల కాంతి రూపములో 1950 ఏప్రిల్ 14న అరుణాచలేశ్వరునిలో లీనమయ్యారు.

శ్రీ రమణ స్వామి తన 16 సంవత్సరాల ప్రాయములో, మధురైలో మిషన్ హైస్కూలులో చదువుకునే రోజులలో, 1896 జూలై 16వ తేదీన, తాను మేడ మీద గదిలో ఒంటరిగా ఉన్న సమయములో పరిపూర్ణమైన ఆరోగ్యముతో ఉండగా, మనస్సులో ఏ విధమైన ఆవేదనగాని, ఆవేశముగాని, ఆందోళన గాని లేకుండా ప్రశాంతముగా ఉన్న సమయములో మరణము వచ్చి ఆయన మీద పడినది. శరీరములో శ్వాస నిలిచి

పోయినది. రక్త ప్రసరణ ఆగిపోయినది. కనులు మూత పడినవి. పెదవులు బిగుసుకుపోయినవి, కాళ్ళు, చేతులు కట్టెలాగ కొయ్యబారి శరీరము శవముగా మారిపోయినది. అయినప్పటికీ ఆయనకు భయముగాని, ఆందోళన గాని కలుగలేదు. పెద్దలకు చెప్పాలనిగాని, వైద్యుని దగ్గరకు వెళ్ళాలని గాని ఆయనకు అనిపించలేదు. ఈ మరణ సమస్యను తనంతటతానే పరిష్కరించుకోవాలని అను కున్నారు. శరీరము శవముగా మారినప్పటికీ శరీరముతో ఇసుమంతయు సంబంధములేని సద్వస్తువు ఆయనకు స్ఫురించినది. శరీరముతో సంబంధము తెగిపోయి నప్పటికి ఆయన అస్థిత్వమునకు అణుమాత్రము కూడా లోటు కనిపించలేదు. ఆత్మ స్ఫురణ సుస్పష్టముగా ఉన్నది. దేహమును బూడిద చేసినప్పటికీ తాను దేహము కాదని, తనకు నాశనము లేదని, ఈ దేహము జడమని, దానికి తాను ఉన్నాననే సంగతి తెలియదని తెలుసుకున్నారు. ఇది ఆయన ఊహకు సంబంధించిన విషయము కాదు - ఇది ఆయన ప్రత్యక్ష అనుభవం. ఆత్మ అంటే ఏమిటో, పరబ్రహ్మం అంటే ఏమిటో, వేదములలో చెప్పబడిన సద్వస్తువు అంటే ఏమిటో ఆయనకు తెలియదు - తెలుసు కోవాలనే కాంక్ష కూడా లేదు. మరణించే ఈ దేహానికి అతీతమైన అమృత వస్తువు ఒకటి ఉన్నదని కూడా

ఆయనకు తెలియని రోజులలోనే ఈ మరణానుభవం ఆయనకు కలిగింది. శ్రీరమణ స్వామి సాధన చేసి ఋషి కాలేదు. ఈ మరణానుభవం వలన ఆయన మనస్సు అంతర్ముఖం అయినది. మనస్సు అంతర్ముఖమైన వారికి ఆత్మదర్శనం అవుతుంది. ఆత్మ దర్శనమైన వాడు ఈ సృష్టి జాలము నుంచి బయటపడతాడు. శ్రీ రమణస్వామి కారణజన్ముడు కాబట్టి పరమేశ్వరుడే స్వయముగా మృత్యువు రూపములో వచ్చి ఆయనను జ్ఞాన సింహాసనము మీద అధిష్ఠింపజేసాడు. ఆయన ద్వారా లోకానికి జ్ఞాన శాస్త్రమును బోధించుటకు పరమేశ్వరుడు ఆయన దేహములో తిరిగి ప్రాణము పోసి, తన స్వాధీనము చేసుకున్నాడు. ఇరువది నిముషముల తరువాత శ్రీ రమణ స్వామికి శ్వాస కదిలినది, రక్త ప్రసరణ ప్రారంభమైనది. గురువు సహాయము లేకుండా, శాస్త్ర శ్రవణము చేయ కుండా, సాధనల పేరుతో శ్రమ పడకుండా, సత్యాత్మ అనేది ఒకటి ఉన్నదని కూడా తెలియకుండా ఆత్మానుభూతిని పొందినవారు మన ఆధ్యాత్మిక చరిత్రలో శ్రీరమణ మహర్షి ఒక్కరే!

ఇంటికి తిరిగిరమ్మని తల్లి రోదిస్తుంటే "ఈశ్వరుడు జీవులను వారి వారి ప్రారబ్ధములను అనుసరించి ఆడిస్తున్నాడు. జరుగవలసినది జరిగేతీరును.

జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు - ఇది నిశ్చయం! కనుక ఊరక ఉండుట ఉత్తమం" అని తల్లికి బోధించిన కరుణామయుడే శ్రీ రమణమూర్తి.

గణపతి శాస్త్రిగారు తపస్సు స్వరూపమును గురించి అడుగగా "నేను అను తలంపు ఎక్కడ పుడుతున్నదో చూడు - అక్కడే మనస్సు లయిస్తుంది. అదే తపస్సు!" అని తపస్సునకే ఒక క్రొత్త నిర్వచనాన్ని చెప్పిన ఆచార్యుడే శ్రీ రమణాచార్యుడు.

మానవుడు బ్రహ్మమైయుండి - ఆ బ్రహ్మమునే వెదకుచున్నాడు. అంటే తనను తానే అన్వేషించుకుంటు న్నాడు. నన్ను తెలుసుకోమని శ్రీ కృష్ణుడు చెప్పినా - నిన్ను నీవు తెలుసుకోమని శ్రీ రమణుడు చెప్పినా - మానవుడు ఏ బ్రహ్మముగా తానై ఉన్నాడో ఆ బ్రహ్మమును గ్రహించమనే చెప్పారు. తన హృదయములో నిరంతరము ప్రకాశిస్తున్న ఆత్మను తెలుసుకొనుట మాని - ఆత్మకోసం శాస్త్రములను శోధిస్తున్న మానవ మానసాన్ని "నేనెవడను?" అను విచారణ ద్వారా అంతర్ముఖి పరచి, ఆత్మ నిష్టకు దారి చూపిన అవతారమే శ్రీ రమణావతారం.

శ్రీ రమణ మహర్షి ఎవరో, ఎక్కడివారో కూడా శ్రీ నాన్నగారికి తెలియదు. తెలియకుండానే ఆయన శ్రీ

నాన్నగారి జీవితములో ప్రవేశించారు. శ్రీ రమణానుగ్రహముతో శ్రీ నాన్నగారు జీవితము యొక్క ఆవలి ఒడ్డు నుంచి "శాంతి" అనే రేవుకు చేరుకున్నారు.

గృహస్తుగా జీవిస్తూ, తన జీవితాన్నే ఒక సందేశముగా చూపిస్తూ, శ్రీ రమణతత్వాన్ని బోధిస్తూ - ఎందరి జీవితాలలోనో జ్ఞాన దీపాలను వెలిగిస్తున్న సద్గురు మూర్తే శ్రీ నాన్నగారు! వారు చెప్పే ప్రతీ మాటలోను, వారి ఔన్నత్యము వ్యక్తమౌతుంది. వారి బోధామృతములోని ఈ క్రింది మాటలే వారి ఆధ్యాత్మిక అంతస్తుకు గీటురాళ్ళు -

"నన్ను చూడగానే మీ మనస్సుకు శాంతి కలిగి, ఆత్మ వైపుకు తిరగకపోతే - ఆ లోపము నాదిగాని - మీది కాదు".

"మీ బుద్ధికి విషయము అందేటట్టుగా చెప్పలేకపోతే ఆ దోషము నాది గాని - మీది కాదు".

"నేను మిమ్ములను స్మరించినంత మాత్రము చేతనే మీ హృదయములో శాంతి కలుగకపోతే - నాలో పవిత్రత లేనట్టే".

"నా హృదయములో శాంతి, పవిత్రత ఉంటే - నా మాటలను మీరు మరచిపోవాలనుకున్నా అవి మిమ్ములను వెన్నంటి తరుముతాయి".

"నా మీద మీకు ప్రేమ లేకపోతే - మీకు ప్రేమ

కలిగేటట్టు చేయవలసిన బాధ్యత కూడా నాదే".

"నాలో స్పందన లేకపోతే మీలో స్పందన రాదు".

"మీరు చేసిన పాపము నేను చేసినట్టుగా భావించకపోతే - నేను బోధించటానికే పనికిరాను".

"మీరు తిన్న అన్నము జీర్ణము చేసుకుంటే మీ ఒంటికి బలము - నా మాటలు జీర్ణము చేసుకుంటే మీ మనస్సుకు బలము".

"నేను చెప్పే మాటలను మీరు, సక్రమముగా అర్థము చేసుకుంటే - అదే మీరు నన్ను గౌరవించినట్లు. మీ కృతజ్ఞతలను గాని, ధనాన్ని గాని, దండలను గాని, దండాలను గాని నేను ఆశించుటలేదు".

"పాము కరుస్తుంది అని చెపితే - పామును చూడగానే ఆ మాటలు గుర్తుకువస్తాయి. అదేవిధముగా - నేను చెప్పే మాటల విలువ ఈ రోజు కాకపోయినా, ఏదో ఒకరోజున, ఏదో ఒక జన్మలో మీకు తప్పక గుర్తుకు వస్తాయి".

"సముద్రపు ఒడ్డున ఉన్న లైట్‌హౌసుల్లాగ మీరందరూ ఈ సమాజానికి వెలుగును చూపాలని కోరుకుంటున్నాను".

ఇజాలపేరుతో, విప్లవాల పేరుతో వెర్రితలలు వేస్తున్న నేటితరానికి ఆయన విసిరిన సవాల్ - "కర్రలు పెట్టి కొట్టు

కొంటూ, కత్తులు పెట్టి కుత్తుకలు కోసుకుంటూ, తుపాకులు పెట్టి కాల్చుకుంటూ, బాంబులు పెట్టి పేల్చుకొంటూ, వీధులలో లూటీలు చేస్తూ అరాచకాన్ని సృష్టిస్తూ - దానికి విప్లవమనో ఏదో పేరు పెడుతున్నారు. కాని అది విప్లవం కాదు. మిమ్మల్ని మీరు సంస్కరించుకోండి - అదే నిజమైన విప్లవం. అంతకు మించిన విప్లవం లేనేలేదు" అని విప్లవానికే ఒక నూతన భాష్యం చెప్పారు శ్రీ నాన్నగారు.

శ్రీ నాన్నగారి హృదయపు లోతును, వైశాల్యమును, సౌందర్యమును పట్టి చూపే కొన్ని మచ్చుతునకల్లాంటి ఆయన మాటలను మీ ముందు ఉంచాను. ఆయన ఆధ్యాత్మిక అంతస్తును మీ దగ్గర ఉన్న కొలబద్దల కొలతలకే విడిచిపెడుతూ - ఆయన బోధామృత సారమును మీ ముందు ఉంచుతున్నాను....



# శ్రీ నాన్న ఉవాచ

## 1. ఆత్మ :

ఉన్నది ఒక్కటే - అది ఆత్మ! ఆ ఆత్మే మనమై ఉన్నాము. మన స్వరూపమే ఆత్మ! ఆత్మ ఒక్కటి మాత్రమే చైతన్యము - ఈ జగత్తు అంతా జడము. ఆత్మ ఒక్కటి మాత్రమే సత్యము - ఈ జగత్తు అంతా అసత్యము. సత్యమును తెలుసుకునే వరకు - అసత్యము సత్యముగా కనిపిస్తుంది, నిజము అబద్ధముగా అనిపిస్తుంది.

ఈ జగత్తుకు ఆత్మే ఆధారము. ఆత్మ అమృత స్వరూపము. జ్ఞాన స్వరూపము, శాంతి స్వరూపము, కాంతి స్వరూపము, సుఖ స్వరూపము, ఆనంద స్వరూపము. అది అమరము, అజరము, అఖండము, అనంతము, అద్వితీయము, అనిర్వచనీయము, అభౌతికము, అలౌకికము. దానిని నీరు తడుపలేదు - నిప్ప కాల్చలేదు - గాలి కదుపలేదు. దానికి ఆదీ లేదు - అంతమూ లేదు. దానికి పుట్టుకాలేదు - మరణమూ లేదు. అది కాలాతీతము, ఊహాతీతము, గుణాతీతము. అట్టి ఆత్మ వస్తువు మన హృదయములో నిరంతరము స్వయముగా ప్రకాశిస్తున్నది. జ్ఞాని దేనిని ఆత్మని అంటాడో - దానినే భక్తుడు దేవుడని అంటాడు. ఆత్మ ఔన్నత్యాన్ని

మాటలలో వర్ణించలేక ఆది గురువు దక్షిణామూర్తి అంతటివాడే మౌనము వహించాడు.


ఆత్మ సుఖస్వరూపము - అందుకే మనము సుఖాన్ని కోరుకుంటాము. ఆత్మ ఆనంద స్వరూపము - అందుకే మనము ఆనందాన్ని కోరుకుంటాము. ఆత్మ ప్రేమ స్వరూపము - అందుకే మనము ప్రేమను కోరుకుంటాము. ఆత్మ అందమైనది - అందుకే మనము అందాన్ని కోరుకుంటాము. ఆత్మకు మరణము లేదు - అందుకే మనము మరణించకూడదని అనుకుంటాము.

సినిమా బొమ్మలకు తెర ఎలా ఆధారమో - అదే విధముగా ఈ సృష్టికి ఆత్మే ఆధారము. అహంకారానికి దేహము కావాలిగాని - ఆత్మకు దేహముతో పనిలేదు. ఆత్మ మన హృదయములో ప్రకాశిస్తున్నప్పటికీ - మబ్బు సూర్యుణ్ణి మూసినట్లు, అహంకారమనే మబ్బు ఆత్మను మన అనుభవ ములోనికి రానివ్వకుండా అడ్డుకుంటున్నది. మీ హృదయ ములో నున్న దోషములు, పాపములే మీకు ఆత్మ వైపునకు దారి చూపుటలేదు. మీలో ఒక్క దోషము ఉన్నప్పటికీ అది మీరు ఆత్మను దర్శించకుండా అడ్డుపడుతుంది.

ఆత్మను తెలుసుకొనుటయే మన జీవిత గమ్యము. మనము ఈ భూమిమీదకు వచ్చినది ఆత్మను తెలుసు కొనుటకే! బలహీనులకు, బద్ధకస్తులకు ఆత్మ తెలియ

బడదు. ఆత్మను దర్శించే వరకూ ఏ జీవుడూ సంతృప్తి పడలేడు. ఎవడైతే ఆత్మను గురించి శ్రద్ధగా శ్రవణము చేసి, మననము చేసి, ఆత్మ నిష్ఠలో స్థిరముగా ఉండ గలుగుతున్నాడో - వాడికి మాత్రమే అహంకారముతో సంబంధము తెగిపోతుంది. జీవించి ఉండగానే అహం కారములో నుండి బయటపడిన వాడికి మాత్రమే ఆత్మ దర్శనమిస్తుంది.

ఆత్మను మీరు చూడలేరు. మీరు పవిత్రులైతే ఆత్మే మీకు దర్శనమిస్తుంది. మీరు ఆత్మను తెలుసుకోవాలని ఎంత తపన పడుతున్నారో - మీకు తెలియబడాలని అంత కంటే ఎక్కువగా ఆత్మ మీకోసము ఎదురు చూస్తున్నది. ఏ జన్మలోనైతే మీకు ఆత్మ అనుభవములోనికి వస్తుందో - అదే మీకు కడసారి జన్మ! ఆత్మను దర్శించిన వాడిని మాత్రమే కామము విడిచిపెడుతుంది - వాడు మాత్రమే ఈ మాయాజాలములో నుంచి బయటపడతాడు.



# 2. మోక్షము

మోక్షము అంటే విడుదల! దేనిలో నుంచి విడుదల? అజ్ఞానములోనుంచి విడుదల! ఏది అజ్ఞానము? అహంకారమే అజ్ఞానము! "నేను" అను తొలితలంపే అహంకారము. "దేహమే నేను" అను పరిమిత బుద్ధే జీవుడిని బంధిస్తున్నది.

మోక్షమంటే అదొక వస్తువుకాదు. మన స్వరూపమే మోక్షం. దీనినే ముక్తి అని, కైవల్యమని, నిర్వాణమని, స్వర్గరాజ్యమని అంటారు. మోక్షం అనేది మరణానంతరం పొందేది కాదు. ఈ లోకములోనుండగా, ఈ దేహములోనుండగా - ఆలోచించి, అర్థము చేసుకొని, అనుభవములోనికి తెచ్చుకోవలసినదే మోక్షం. అది ఇప్పుడే ఉంది. ఇక్కడే ఉంది. సిద్ధముగా ఉంది. ఆ సిద్ధముగా ఉన్న వస్తువును తెలుసుకున్నవాడే సిద్ధపురుషుడు. మోక్ష సుఖము ఆకాశగంగ వంటిది. దానికి మాలిన్యము లేదు.

మోక్ష సుఖము మీరు సాధిస్తే వచ్చేది కాదు. అది నిరంతరమూ మన హృదయములోనే ప్రకాశిస్తున్నది - మోహము పోతే అది మీకు వ్యక్తమౌతుంది. మీ బుద్ధిలో దోషముండుట వలన అది ఎక్కడో దూరాన ఉన్నదని మీరు భ్రమపడుతున్నారు. మీరు మోక్షము కోరుకునే

టప్పుడు కూడా మీరు మోక్షములోనే ఉన్నారు. మీరు పొందాలనుకుంటున్నది మీరై ఉన్నారు. జ్ఞానము పొందిన తరువాత ఈ సత్యము మీకు తెలుస్తుంది.

# 3. దేవుడు

మీ స్వరూపమే దేవుడు! దేవుడు వేరు - ఆత్మ వేరు కాదు. దేవుడు వేరు - సత్యము వేరు కాదు. దేవుడు వేరు - అనుగ్రహము వేరు కాదు. దేవుడు సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడు సర్వస్వతంత్రుడు. అంతటా ఉన్న దేవుడు మన హృదయములో కూడా ఉన్నాడు. మన దేహము పరిమితమైనది. అదే విధముగా మన మనస్సు, మన తెలివి కూడా పరిమితమైనవే. కాని మన హృదయములో నున్న దైవము అపరిమితమైనది. ఆ దైవము మనకు అనుభవములోనికి వస్తే - స్వేచ్ఛ కలుగుతుంది, సుఖము తెలుస్తుంది. బాహ్యంగా ఉన్న దేవుడు కనిపిస్తాడు - వెళ్ళిపోతాడు. కాని ఆత్మ రూపములో ఉన్న దేవుడు మాత్రము మనల్ని విడిచిపెట్టకుండా శాశ్వత శాంతిని ప్రసాదిస్తాడు. మన దేహముకంటే, మన ఇంద్రియములకంటే, మన మనస్సుకంటే, మన బుద్ధికంటే కూడా దేవుడు మనకు దగ్గరగా ఉన్నాడు. మన హృదయములోనే ఉన్నాడు - చూస్తున్నాడు. మనము చేసే ప్రతీ

కర్మకు సాక్షిగా ఉన్నాడు. కర్తృత్వముతో మనము మంచి చేస్తే మంచి, చెడ్డ చేస్తే చెడ్డ మనచేత అనుభవింప చేస్తాడు. మనము దేవుణ్ణి మోసగించలేము.

మీరు దేవుణ్ణి కోరుకున్నంత మాత్రాన ఆయన మీకు తెలియబడడు - ఆయన మిమ్ములను కోరుకోవాలి. దేవుడు మిమ్మల్ని స్మరించకపోతే - మీరు దేవుణ్ణి స్మరించ లేరు. మీ తలంపులకు శక్తిలేదు - శక్తి దేవునిది. దేవుణ్ణి తెలుసుకోవాలనే కోరిక మీకు బలముగా వస్తున్నదంటే - ఆ దేవుని కృప మీ మీద ఉన్నట్లే! దైవానుగ్రహము ఎప్పడూ ఉంది. అది మిమ్ములను తడపకుండా మీ జీవలక్షణాలే మీకు అడ్డువస్తున్నాయి. జీవ లక్షణాలను విడిచిపెడితే జీవుడు దేవుడౌతాడు. దేవుని చేరుకొనే వరకూ దుఃఖము విడిచిపెట్టదు. ఎవడైతే తన అహంకారమనే పుష్పాన్ని దేవుని పాదాల చెంత అర్పిస్తాడో వాడి హృదయము పవిత్ర మౌతుంది. పరమ పవిత్రునికి మాత్రమే దేవుడు తెలియ బడతాడు. ఎండుటాకులు గాలి చేతిలో ఎలా ఉంటాయో - అలా దేవుని స్వాధీనములో ఉన్నవాడికి జ్ఞానము కలుగు తుంది. మానవజన్మ నెత్తి జ్ఞానము పొందుటకు ప్రయత్నిం చని జీవుడిని దేవుడు మరలా దేహము యిచ్చి శిక్షిస్తాడు.

మీరు పని చేస్తున్నప్పడు - చేసే పనిని చూడడు దేవుడు. ఆ పని చేసేటప్పడు మీ హృదయములో నున్న

ఉద్దేశ్యమును చూస్తాడు. ఉద్దేశ్యము ఉదాత్తమైనది అయితే దేవుని దయ వర్షిస్తుంది - దారి కనిపిస్తుంది - మనస్సు నిర్మలమౌతుంది. ప్రారబ్ధాన్ని ప్రీతితో స్వీకరించి, హెచ్చు తగ్గులు లేకుండా నిర్మల మనస్సుతో జీవిస్తూ, నిరంతరము ఆత్మ నిష్ఠలో నిలకడగా ఉండగలిగితే - దేవుడు సంతోషించి "దైవానుగ్రహము" అను బహుమతిని మీకు ప్రసాదిస్తాడు. దేహప్రారబ్ధ బలముకంటే దైవానుగ్రహ బలము గొప్పది. మనము దేవుడిని తెలుసుకొనుటకు చేయు ప్రయత్నమే "సాధన" - ఆ దేవుడిని తెలుసు కొనుటకు దేవుడు మనకు యిచ్చు శక్తే "అనుగ్రహం"! దైవానుగ్రహము ఉంటే - అన్నీ ఉన్నట్లే.

# 4. జ్ఞాని

జ్ఞానము కలవాడు జ్ఞాని. తన స్వరూపము తాను తెలుసుకున్నవాడు జ్ఞాని. సూర్యునికి చీకటి తెలియదు - జ్ఞానికి దుఃఖము తెలియదు. ఈ లోకాన్ని జ్ఞాని మాత్రమే ప్రేమించగలడు. జ్ఞానిది శివదృష్టి - అజ్ఞానిది శవదృష్టి. "నేను ఆత్మను - నాకు ఒక దేహము ఉంది" అని జ్ఞానికి తెలుసు. "నేను దేహాన్ని - నాకు ఒక ఆత్మ ఉంది" అని అనుకుంటాడు అజ్ఞాని. జ్ఞాని దేహము ఒక దేవాలయము. దానిని రక్షించే బాధ్యతను దేవుడే చూసుకుంటాడు. దేహ

ప్రారబ్ధాన్ని అనుసరించి జ్ఞానికి జరుగవలసిన పనులు జరుగుతుంటాయి - కాని జ్ఞానికి కర్తృత్వము ఉండదు. ఈ లోకములోగాని, పరలోకములోగాని జ్ఞానికి పనిలేదు - కాని జ్ఞానిద్వారా పని జరుగుతుంది.

జ్ఞాని స్వరూపము మౌనమే. కాని మౌనము మనకు అర్థము కాదు కాబట్టి, మన మీద కరుణవల్ల జ్ఞాని మాటలాడుతాడు. ఈ లోకానికి మేలు చేయాలని జ్ఞాని అనుకోనక్కరలేదు - జ్ఞాని శరీరము ధరించి ఉన్నంత మాత్రముచేతనే ఈ లోకానికి మేలు జరుగుతుంది. మల్లెపూల సన్నిధిలో కూర్చొని మనకు పరిమళము రావాలని కోరుకోనక్కరలేదు - పరిమళం సహజంగా వస్తుంది. అదేవిధముగా జ్ఞాని సన్నిధిలో శాంతి, శక్తి, కాంతి నిండి వుంటాయి. జ్ఞానిని దర్శించినంత మాత్రముచేతనే "మనకు సద్బుద్ధి కలగాలని, మనల్ని మనము సంస్కరించుకోవాలని" అనిపిస్తుంది.

మహిమలు చేసినవాడు జ్ఞానికాడు సమత్వము కలవాడే జ్ఞాని. గాలిలో తేలిపోయేవాడో, నీటిమీద నడిచి పోయేవాడో జ్ఞానికాడు - కాలాన్ని, కామాన్ని జయించిన వాడే జ్ఞాని. మరణించినవాడిని బ్రతికించినంత మాత్రాన వాడు జ్ఞానికాడు - మరణించినవానిలాగ జీవించేవాడే జ్ఞాని. తనకంటే వేరుగా జ్ఞాని ఈ లోకాన్ని చూడడు.

దేవుడు లేడని చెప్పేవాడిని కూడా దేవునిలాగే చూస్తాడు జ్ఞాని! జ్ఞాని వైభవాన్ని జ్ఞాని ముఖములో చూడవలసినదే గాని - పుస్తకాలలో కనబడదు.

మనోమూలాన్ని శోధించినవాడు జ్ఞాని అవుతాడు - ప్రకృతి మూలాన్ని శోధించినవాడు సైంటిస్టు అవుతాడు. లోకంలో జరిగే సంఘటనలకు సైంటిస్టు చలిస్తాడు - కాని జ్ఞాని చలించడు. జీవితములో పరిశీలన, పరిశోధన లేనివాడు జ్ఞాని కాలేడు. మానవుడు జ్ఞాని కాలేకపోతే దేవునిలో లయముకాలేడు. జీవుని స్వరూపముకంటే జ్ఞాని వేరుగాలేడు. జ్ఞానిని సేవించినా ఈ జీవులు తరిస్తారు.

# 5. గురువు

ఆత్మను దర్శించినవాడే గురువు శబ్దానికి అర్హుడు. దేవుడు వేరు - గురువు వేరు కాదు. రూపము లేని దేవుడిని ఆరాధించుట కష్టము కాబట్టి - ఆ దేవుడే ఈ జీవులపట్ల ప్రేమచేత దేహము ధరించి గురు రూపములో వస్తుంటాడు. మీరు చేసే సాధనలకంటే గురువు మీకు చేసే సహాయము గొప్పది. గురువు అనుగ్రహముతో సమానమైనది వేరొకటి లేదు. ఒకవేళ దేవునికే గనుక మీమీద కోపము వస్తే - మీ గురువు

మిమ్మల్ని రక్షించగలడు. కాని మీ గురువుకే గనుక మీ మీద కోపమువస్తే - ఆ దేవుడు కూడా మిమ్మల్ని రక్షించలేడు.

బాహ్యగురువు అబద్ధమే అయినప్పటికీ అవసరమే! మీ ప్రారబ్దవాసనలను పలుచబడేటట్లుచేసి, మీ మనస్సును అంతర్ముఖపరచి, మీ స్వరూపాన్ని మీకు పట్టి చూపేవాడే గురువు. గురువు మీకు చేసే సహాయము లోపల - అది బయటికి కన్పించేది కాదు. మీ కొలతలకు దొరికేది కాదు. మీకు జ్ఞానము కలిగే వరకూ జన్మజన్మలకూ మీ వెంట వుండి మిమ్మల్ని రక్షించేది మీ గురువు ఒక్కడే. పులినోటిలో పడిన మాంసపుకండైనా జారిపోతుందేమోగాని - గురువు అనుగ్రహములో పడినవాడు మాత్రము రక్షింపబడే తీరతాడు.

గురువునని ప్రకటించుకున్న ప్రతీవాడు గురువు కాదు - ప్రకటించుకునే పరిమిత బుద్ధిని వాడు దాటలేదు కాబట్టి. మంత్రము చెప్పిన ప్రతివాడూ గురువు కాదు - మంత్రోపదేశముతో మీ మనస్సును అంతర్ముఖపరచగల వాడే గురువు. పాదపూజలు చేయించుకున్న ప్రతివాడూ గురువుకాదు - పవిత్రమైన చరిత్రగలవాడే గురువు.

ఏ మహాత్ముని కంటిచూపు మీలోని చైతన్యాన్ని మేల్కొలుపుతుందో, ఏ పరమపవిత్రుని వాక్కు మిమ్మల్ని వెన్నంటితరుముతుందో, ఏ పుణ్యపురుషుని పాద స్పర్శ మీ

మనస్సును అంతర్ముఖపరుస్తుందో, ఏ సత్పురుషుని సాన్నిధ్యము మిమ్మల్ని పరమపదము చేరుస్తుందో - అతడే మీకు గురువు. మీనుంచి ప్రతిఫలము ఆశించేవాడు గురువు కాదు - బరువు!

తల్లి ఋణము తీర్చుకోవచ్చును - తండ్రి ఋణము తీర్చుకోవచ్చును, బడిలో పాఠాలు చెప్పిన గురువు ఋణము తీర్చుకోవచ్చును - కాని, మన స్వరూపాన్ని మనకు పట్టి యిచ్చే గురువు ఋణము మాత్రము తీర్చుకోలేము. గురువును మించినదైవము లేడు - లేడు - లేడు. గురువు అంతటివారు మీరు కావటమే గురువుకు మీరు ఇచ్చే గురుదక్షిణ.

# 6. అహంకారము

"నేను" అను దేహపరిమితమైన తొలి తలంపే అహంకారము. ఈ "నేను" అను తొలి తలంపుకే మిగిలిన తలంపులన్నీ వచ్చుచున్నవి. ఈ "నేను" అను మొదటి తలంపు ఇతర తలంపులను విషపూరితము చేయుచున్నది. అహంకారము ఉంటే అంతా వుంది - అహంకారము పోతే ఏమీలేదు. "అహంకారము" అను ఒంటి స్థంభముమీదనే ఈ సృష్టి అంతా ఆధారపడి ఉన్నది. అహంకారము ఉన్నంత కాలము - దేహము నిజము, జగత్తు నిజము, దేవుడు నిజము. అహంకారము పోయిన తరువాత ఈ

మూడూ అబద్ధమే! అహంకారము యొక్క విజృంభణ వలననే మనకు ఆత్మ తెలియుటలేదు. దేహమాత్రుడనని తాను అనుకున్నంత కాలమూ - ఏ జీవుడినీ అహంకారము విడిచిపెట్టదు. అహంకారము ఉన్నంత కాలమూ వేరు భావన విడిచిపెట్టదు. అహంకారమే అశాంతిగా పరిణమిస్తుంది. దేహము ఉన్నంత కాలమూ బట్టలు ఎలా వేసుకుంటామో - అహంకారము ఉన్నంత కాలమూ దేహాలు వస్తూనే ఉంటాయి. ఈ అహంకారము అజ్ఞానము వలన పుట్టినది. అజ్ఞానమే పాపము!

అహంకారానికి రూపము లేదు. కాని అహంకారము ఉన్నంత కాలమూ ఏదో ఒక రూపాన్ని పట్టుకునే ప్రేలాడుతుంది. అహంకారము స్త్రీ కాదు - పురుషుడూ కాదు. కానీ స్త్రీ రూపమునుగాని, పురుషుని రూపమునుగాని ధరిస్తుంది. మాయనంతా అహంకారము లోనే పెట్టాడు దేవుడు. అహంకారము పుట్టినప్పడే జీవుడు పుట్టాడు - మరల అహంకారము మరణించినప్పడే జీవుడు మరణిస్తాడు. అహంకారము బుడగైతే - ఆత్మ సముద్రము వంటిది. బుడగలేకుండా సముద్రము ఉండగలదు - కాని సముద్రము లేకుండా బుడగ ఉండ లేదు. అదేవిధముగా అహంకారము లేకుండా ఆత్మ ఉండగలదు - కాని ఆత్మ లేకుండా

అహంకారము ఉండ లేదు. బుడగతో తాదాత్మ్యము చెందితే దుఃఖము వస్తుంది. కాని బుడగకు ఆధారముగా నున్న నీటితో తాదాత్మ్యము చెందితే దుఃఖము నశిస్తుంది.

ప్రతివాడూ లోకాన్ని ఉద్ధరించాలని అనుకుంటాడు. దేవాలయాలమీద ఉన్న బొమ్మలు ఆ బరువునంతా తామే మోస్తున్నామని అనుకోవటము ఎటువంటిదో - ఈ లోకాన్ని మనమే ఉద్ధరించాలని అనుకోవటము కూడా అటువంటిదే! మనము అహంకారమనే బరువును మోస్తున్నాము కాబట్టే మన బ్రతుకులు యింత భారమనిపిస్తున్నాయి. అహంకారము ఉన్న మనిషి కర్తృత్వాన్ని విడిచి పెట్టి పనిచేయలేడు. కర్తృత్వము ఉన్నంత కాలము - అజ్ఞానము విడిచిపెట్టదు, దుఃఖము విడిచిపెట్టదు, పాప పుణ్యాలు విడిచిపెట్టవు, జనన మరణాలు విడిచిపెట్టవు. అహంకారాన్ని విడిచిపెట్టకుండా ఏ జీవుడూ జ్ఞాని కాలేడు.

ఎవడైతే తన అహంకారాన్ని శిలువవేస్తాడో - వాడికి శివస్వరూపము దర్శనమౌతుంది. అహంకారము లేకుండా జీవించుటకంటే మించిన తపస్సు లేదు. విచారణ చేసి అహంకారము యొక్క మూలాన్ని తెలుసుకుంటే - మీకు ఉన్న ఆత్మ వ్యక్తమౌతుంది; లేని అహంకారము రాలిపోతుంది. ఆత్మను దర్శించేవరకు ఈ అహంకారము యొక్క విజృంభణ అణగదు.

# 7. రాగద్వేషాలు

సమాజములో యింత అశాంతికి, దుఃఖానికి కారణము రాగద్వేషాలే! రాగద్వేషాలన్నా, కామక్రోధాలన్నా ఒక్కటే! పైకి వేరుగా కనిపించినా మూలములో ఒక్కటే - అదే కామము! మోహము వలన కామము పుడుతుంది. కామము అంటే కోరిక! కామములోనుంచి రాగద్వేషాలు పుడుతున్నాయి. కామములేని వాడికి రాగంలేదు - ద్వేషం లేదు. మనకు ఏదైతే చెడు చేస్తుందో దానినే మనము మంచి అనుకొని ఇష్టము పెంచుకుంటాము - అదే రాగము. మన ఇష్టానికి ఎవరైనా అడ్డుపడితే ద్వేషం పెంచుకుంటాము. మనల్ని ఎవరైనా పొగిడితే రాగం పెంచుకుంటాము - దూషిస్తే ద్వేషిస్తాము. ఈ ద్వేషం నిప్పలాంటిది. ప్రతివాడు రాగద్వేషాలతో, కామక్రోధాలతో కాలిపోతున్నాడు.

రాగద్వేషాలు ఉన్నంతకాలమూ మనస్సు బహిర్ముఖమవుతుంది. బహిర్ముఖమైన మనస్సుకు హృదయములోనున్న ఆత్మ తెలియదు. పొగచేత నిప్ప, మురికిచేత అద్దము, మావిచేత శిశువు కప్పబడినట్లు - కామము మీ బుద్ధిని, మీ మనస్సును, మీ ఇంద్రియముల ను ఆక్రమించుకొని, మీ హృదయములోనున్న ఆత్మను

మీకు తెలియకుండా మూసివేస్తున్నది.

మీలోనున్న కామమే మీకు శత్రువు. కామము మీ వివేకాన్ని చంపివేస్తుంది; మీచేత పాపము చేయిస్తుంది; మీలోని శాంతిని, కాంతిని నాశనము చేస్తుంది. కనుక కామాన్ని జయించండి. కామాన్ని జయించుట కష్టమైనప్పటికీ అది అసాధ్యము మాత్రము కాదు. కామాన్ని, కాలాన్ని జయించినవానికే జ్ఞానము కలుగుతుంది.

కామాన్ని ఎవ్వరూ సంతృప్తిపరచలేరు. దానికి ఆకలి బాధేగాని - అజీర్తి బాధలేదు. కోరికలను సంతృప్తి పరచుకుంటూ ఏ మనిషీ కోరికలను జయించలేడు. కామాన్ని సంతృప్తి పరచుకుంటూ కామాన్ని జయించలేడు. మనిషికి కామం వచ్చినా, ద్వేషం వచ్చినా - తలంపు రూపములోనే వస్తున్నది. తలంపు లేకుండా మనిషి ఏ పనీ చేయడు. కనుక విచారణ చేసి తలంపు ఎక్కడ పుడుతుందో చూడండి. అక్కడే ఆత్మ మీకు దర్శనమిస్తుంది. ఆత్మను దర్శించేవరకూ ఏ జీవుడూ కామాన్ని జయించలేడు. రాగద్వేషాలు లేనివాడికి ఈ లోకముతో పనిలేదు. వాడు మాత్రమే ఉద్రేకమునకు దూరముగా ఉండగలడు. వాడి ఇంద్రియములు, వాడి మనస్సు చలించవు. వాడు కొండలాగ అచలుడై ఉంటాడు.

# 8. మనస్సు

'నేను' అను తలంపు ప్రథమ తలంపు. ఈ ప్రథమ తలంపునకే మిగిలిన తలంపులు వస్తున్నాయి. ఈ నేను తలంపు, మిగిలిన తలంపులు కలిసి మనస్సు అయినది. ఈ మనస్సునే జీవుడు అని అంటారు. మన శరీరము మరణించినప్పటికీ ఈ జీవుడు మరణించడు - వాడు మారడు. వాడికే మరల కొత్త శరీరము వస్తుంది. గాఢ నిద్రలో మనకు తలంపులు లేవు - అప్పుడు మనస్సు లేదు, దేహం లేదు, లోకం లేదు, దేవుడు లేడు - అప్పుడు మీరు సుఖముగా ఉన్నారు. మరల నిద్రలోనుంచి మెలుకువ రాగానే "నేను" అను తలంపు వస్తున్నది. దాని వెనకాలే మీ గొడవలన్నీ గుర్తుకు వస్తున్నాయి. సంసారమంటే మీ భార్యబిడ్డలే సంసారం కాదు - మీ మనస్సే సంసారం! మీరు అరణ్యానికి వెళ్ళినా మీ మనస్సు మిమ్మల్ని విడిచిపెట్టదు. మీరు పరిష్కరించవలసినది మీ మనస్సును. మీరు ఇల్లు విడిచి పెడితే మాత్రము మీ మనస్సు మిమ్ములను విడిచి పెడుతుందా?

మనస్సుకు రూపం లేదు, నామం లేదు. కాని మనస్సు నశించే వరకూ అది ఏదో ఒక నామాన్నో, రూపాన్నో పట్టుకొని వేలాడుతుంది. మీ శరీరానికి అన్నము మేత అయితే - మీ మనస్సుకు నామరూపాలే మేత! ఆత్మను

తప్ప అన్నింటిని మీ మనస్సే సృష్టించినది. మీ మనస్సులో లేనిది ఏదీ మీకు ఈ సృష్టిలో కనిపించదు.

సాలిపురుగు తన గూడును తానే అల్లుకొని, అందులోనే కాపురముండి, చివరకు అందులోనే మరణిస్తుంది. అదేవిధముగా మీ మనస్సే ఈ సంసారాన్ని సృష్టించినది, మీ మనస్సే ఈ సంసారము చేస్తున్నది. చివరికి ఈ సంసారములో చిక్కుకుని జనన మరణముల వలయములో పడి కొట్టుకుంటున్నది. ఈ సంసారాన్ని ఏ మనస్సు అయితే సృష్టించినదో - దానిని నాశనము చేసే శక్తి కూడా ఆ మనస్సుకే ఉంది. సంస్కరింపబడిన మనస్సు విశాలమై అది ఆత్మాకారము చెందుతుంది.

మెదడు టేపురికార్డరు వంటిది. మనస్సు టేపు లాంటిది. ఇంద్రియాలే స్పీకర్లు! టేపులోని మాటలనే టేపు రికార్డరు స్పీకరు ద్వారా వినిపిస్తుంది. అదేవిధముగా మీ మనస్సులోని వాసనలనే మీ మెదడు ఇంద్రియముల ద్వారా అనుభవింపచేస్తుంది. మీకు తలంపు వచ్చే వరకు మీ మనస్సులో ఏముందో కూడా మీకే తెలియదు. మీ తలంపులను బయటికి లాగి మంటపెట్టేవాడే సద్గురువు.

పూర్వ జన్మలలో మీరు చేసిన పనులే వాసనలుగా మారి, బీజరూపములో మీ హృదయములో దాగి వుండి, తలంపుల రూపములో మీ శిరస్సులో విజృంభిస్తున్నాయి.

గడ్డివెంటులోని గడ్డిపరకల్ని ఒక్కొక్కటి తీసివేస్తే గడ్డివెంటు అనేదే వుండదు. అదేవిధముగా మీ హృదయములోనున్న తలంపులన్నీ రాలిపోతే మనస్సు అనేది కూడా లేదు. పొయ్యి లోని పుల్లల్ని ఒక్కొక్క దానిని బయటికి తీసివేస్తే పొయ్యి ఆరిపోతుంది. అదేవిధముగా మీ మనస్సులోని తలంపులన్నీ బయటికి పోతే మీ మనస్సు నశిస్తుంది. మనస్సు శుద్ధి కాకుండా జ్ఞానము కలుగదు. హృదయములో నున్న దోషములు నిశ్శేషముగా బయటికి పోకుండా ఏ జీవుడూ జ్ఞాని కాలేడు.

మనస్సు, ప్రాణము - ఇవి రెండూ పుట్టినచోటు హృదయమే! తలంపులు మనస్సు యొక్క ప్రవృత్తి అయితే - ఉశ్ఛ్వాస నిశ్వాసలు ప్రాణము యొక్క వృత్తి. మీ శ్వాసను అదుపుచేసుకుంటే మీ మనస్సు కూడా అణుగుతుంది. అందుకే ప్రాణాయామము చెప్పారు మన పెద్దలు. కాని మనస్సు అణిగితే జ్ఞానము కలుగదు - మనస్సు నశిస్తే జ్ఞానము కలుగుతుంది.

ప్రతివ్యక్తి తాను వాడుకునే వస్తువులలో నాణ్యతను కోరుకుంటాడు - కాని తన మనస్సు నాణ్యముగా ఉండాలని కోరుకోడు. బాహ్య విషయములను చింతిస్తున్నంత కాలమూ మీ మనస్సు చలిస్తూనే ఉంటుంది. అది బహిర్ముఖము అవుతూనే ఉంటుంది. మనస్సు బహిర్ముఖము

అవుతున్నంతకాలమూ మీ హృదయములో పాపము ఉన్నట్లే! ధ్యానము చేసినా, జపము చేసినా, మనస్సు బహిర్ముఖము అవుతున్నంత కాలమూ - మీకు జ్ఞానము కలుగదు.

సంస్కరింపబడిన మనస్సు మాత్రమే అంతర్ముఖ మవుతుంది. మనస్సును సంస్కరించుకొనుటకే సాధన. ఏకాగ్రత, పవిత్రత, ప్రవీణత, వినీతత లేనివాడు సాధన చేయ లేడు. నిష్కామకర్మను ఆచరిస్తూ, సత్పురుష సహవాసము చేస్తూ, సద్విషయ శ్రవణము చేస్తూ, నిరంతర ఆత్మ చింతనలో తన మనస్సును ఎవడు నానబెట్టుకుంటాడో - వాడి మనస్సు మాత్రమే సంస్కరింపబడుతుంది. పుణ్య బలము వల్ల, యోగ బలము వల్ల ఎవడి మనస్సైతే సంస్కరింపబడి సూక్ష్మాతి సూక్ష్మమై, స్ఫటికవలే స్వచ్ఛముగా ఉంటుందో - వాడి మనస్సు మాత్రమే అంతర్ముఖమవు తుంది. మనస్సును అంతర్ముఖము చేసి దాని పుట్టు చోటు అయిన హృదయములో స్థిరముగా నిలిపి ఉంచగలిగితే - అది ఆత్మాకారము చెందుతుంది. శుచిలేనివాడికి గతి లేదు. అన్నము వలన మీ శరీరానికి శక్తి వస్తే - శరణాగతి వలన మీ మనస్సుకు శక్తి వస్తుంది. శరణాగతి ఉన్న వాడికి దైవానుగ్రహము వర్షిస్తుంది. దైవానుగ్రహము మనస్సు అనే మదపుటేనుగునకు అంకుశము వంటిది. మనస్సును మింగినవాడు యోగి - లొంగిన వాడు భోగి అవుతాడు.

# ౯. అంతఃకరణ శుద్ధి

ఎవరు ఏ కులములో పుట్టినప్పటికీ, ఏ దేవుణ్ణి ఆరాధించినప్పటికీ, ఏ గురువును ఆశ్రయించినప్పటికీ, స్త్రీలైనప్పటికీ, పురుషులైనప్పటికీ, ఈ లోకములో గాని, పర లోకములోగాని, ఈ జన్మలో గాని, మరుజన్మలోగాని "అంతఃకరణ శుద్ధి" అను గేటు ద్వారా మాత్రమే మోక్షము పొందాలి. అంతఃకరణమును శుద్ధి చేసుకొనుటకంటే మించిన పని మరొకటి లేదు - ఉన్నదని అనిపిస్తే, అది మీ మనస్సు చేస్తున్న గారడి. శరీరానికి పట్టిన చెమటను నీటితో ఎలా కడుగుకుంటారో - అదేవిధముగా మనస్సు లోనున్న మాలిన్యాన్ని "భక్తి" అనే నీటితో శుద్ధి చేసుకోవాలి.

# ౧౦. ఇంద్రియ నిగ్రహము

ఇంద్రియ నిగ్రహము లేకుండా మనోనిగ్రహము సాధ్యము కాదు. మనో నిగ్రహము లేకుండా చిత్తశుద్ధి సాధ్యము కాదు. చిత్తశుద్ధి లేనివాడు ఆత్మను దర్శించ లేడు. ఆత్మను దర్శించినవాడికి మాత్రమే సమత్వదృష్టి సాధ్యపడుతుంది. సమత్వమే యోగసారము. సమత్వదృష్టి లేని జీవుడు దేవుడు కాలేడు. ఇంద్రియముల ఆకర్షణకు లోబడినవాడు ఏనాటికైనా పతనమౌతాడు. ఇంద్రియముల

ఆకర్షణను నిరోధించలేని జీవుడు మాయను జయించలేడు.

బాహ్యేంద్రియాలు స్మశానములోనే కాలిపోతాయి. కాని లోపల వున్న సూక్ష్మ ఇంద్రియాలు మాత్రము స్మశానములో కాలవు. అవి మరుజన్మకు కూడా మీ వెంట వస్తాయి. ఇంద్రియ నిగ్రహము లేనివాడు భగవంతుని దిశగా ప్రయాణము చేయలేడు. మీ ఇంద్రియములు గనుక మీ స్వాధీనములో ఉంటే ఈ లోకమంతా ఏకమై ఎదురు నిలిచినా మిమ్మల్ని ఏమీ చేయలేదు. స్వాధీనము లోనున్న ఇంద్రియములు మిత్రునిలా మేలు చేస్తాయి - స్వాధీనములో లేని ఇంద్రియములు దుష్టునిలా కీడు చేస్తాయి. లోకమును జయించిన వాడికంటే - తన ఇంద్రియములను జయించినవాడు మంచివాడు, గొప్పవాడు కూడా. ఇంద్రియములు పెంకి గుఱ్ఱముల వంటివి. వాటిని బుజ్జగించి మచ్చిక చేసుకోవడానికి స్వప్రయత్నముతోపాటు దైవానుగ్రహము కూడా అవసరము. లోకవిషయాలను చింతిస్తూ ఇంద్రియము లను నిగ్రహించలేము. నిరంతర ఆత్మ చింతనవలన ఇంద్రియములు స్వాధీనములోనికి వస్తాయి.

# 11. మనో నిగ్రహము

జీవితము నిగ్రహానికి పరీక్షలాంటిది. మనో నిగ్రహము లేనివాడు చిత్తశాంతిని సాధించలేడు. శాంతి లేనివాడు పాపముతో పోరాడలేడు. మనస్సు అణిగి ఉన్నప్పుడు అందరూ శాంతిగానే ఉంటారు. కానీ అహంకారము మీద ఎవరైనా చిన్న దెబ్బకొడితే - చెరువులో రాయి విసిరితే కెరటాలు వచ్చినట్లు - వెంటనే మనస్సులో వికారము పుడుతుంది, కోపమువస్తుంది, శాంతిపోతుంది. జీవితములో ఒడిదుడుకులు సంభవించినప్పటికీ మనిషి శాంతిగా ఉండగలిగితే - వాడికి మనో నిగ్రహము ఉన్నట్లు గుర్తు. మనస్సు విజృంభిస్తున్నంత కాలమూ ఏ మనిషీ శాంతిగా ఉండలేడు. మనో నాశనము అయినవాడికి మాత్రమే శాశ్వత శాంతి చేతికి అందుతుంది. ఆత్మ విచారణ శాంతిని ఇస్తుంది - లోక విచారణ అశాంతిని తెస్తుంది.

# 12. పుణ్యము - పాపము

"సత్కర్మలను ఆచరిస్తే పుణ్యము వస్తుంది - దుష్కర్మలను ఆచరిస్తే పాపము వస్తుంది. పుణ్యపాపాలు రెండూ కూడా మనస్సు యొక్క పరిధిలోనివే. పుణ్యము

బంగారు సంకెళ్ళు అయితే - పాపము ఇనుప సంకెళ్ళు. బంధించడానికి ఏదైనా ఒక్కటే! పుణ్యము వలన సుఖము వస్తుంది - పాపము వలన దుఃఖము వస్తుంది. కాని పుణ్యము చేయగా చేయగా జ్ఞానము పొందాలనే కాంక్ష పుడుతుంది. అందుకు పుణ్యము చేయమన్నారు మన పెద్దలు. పుణ్యము వలన మోక్షము రాదు - జ్ఞానము వలన మోక్షము వస్తుంది. జ్ఞానము ధనము వలన రాదు - అఖండ వైరాగ్యము వలన వస్తుంది.

# 13. వైరాగ్యము

వివేకమును ఆచరణలో పెడితే - అది వైరాగ్యము నకు దారి చూపుతుంది, ప్రేమను కూడా ఉత్పత్తి చేస్తుంది. కర్తృత్వమును విడిచిపెట్టి పనిచేస్తే వైరాగ్యము వస్తుంది. వైరాగ్యమనేది ఒక గొడ్డలి లాంటిది. ఈ వైరాగ్యమనే గొడ్డలితో తన అహంకారమనే వృక్షాన్ని ఎవడైతే నరుకు కుంటాడో - వాడికి జ్ఞానము కలుగుతుంది. వివేకము వలన వచ్చే వైరాగ్యము నిలబడుతుంది - నిరాశ వలన వచ్చే వైరాగ్యము నిలబడదు.

# 14. శరణాగతి

ఆత్మయందు స్థిరమైన, నిజమైన విశ్వాసము కలిగి ఉంటే - అదే శరణాగతి! శరణాగతి గనుక ఉంటే ఎంతటి కష్టాన్నైనా ఈశ్వర ప్రసాదంగా భావించి, ఓర్పుతో భరించగలుగుతారు. దైవముపట్ల ఎంతవరకూ శరణాగతి చేయగలిగితే - అంతవరకూ ఆత్మ సౌందర్యము గోచరిస్తుంది. మీ హృదయములో ఆత్మగా ప్రకాశిస్తున్న దైవమును మీరు హృదయ పూర్వకముగా ప్రేమిస్తే - ఆయన మీ బుద్ధిని శుద్ధి చేస్తాడు, మీ వివేకాన్ని పెంచుతాడు, మీలో ప్రకాశిస్తున్న ఆత్మను మీకు పట్టి చూపుతాడు. కాని మీరు ఆయనకు చెల్లించవలసినది భక్తి - ఆయన యిస్తాడు మీకు ముక్తి, భుక్తి కూడా.

# 15. ఆనందము

అంతటా ఉన్నది ఆనందమే! ఆనందమే ఆత్మ స్వరూపం! ఈ బాహ్య ప్రపంచములో మనము పొందే విషయానందము నిజమైన ఆనందము కాదు - అది కేవలము భ్రాంతి మాత్రమే. ఈ విషయానందము ఏదో ఒకనాటికి దుఃఖాన్ని కూడా తీసుకువస్తుంది. మన మనస్సు నిర్మలమై, తలంపులు సన్నగిల్లినప్పడే మనము

ఆత్మానందాన్ని అనుభవించగలుగుతాము. ఆత్మానందాన్ని ఒక్కసారి రుచి చూసిన మనస్సు ఆత్మను విడిచిపెట్టదు. ఆత్మానందమే అమృతము.

# 16. జాతకాలు

అదృష్టము అరిచేతిలోని గీతలలో లేదు. మానవుడు చేసే కృషి మీద ఆధారపడి ఉంది. జాతకాల పేరుతో మీరు వాస్తవ జీవితానికి దూరము కావద్దు. మీరు మంచి చేస్తే మంచి, చెడు చేస్తే చెడు మీకే ఎదురు వస్తాయి. దేవుని పిలుపు ఎప్పుడు వస్తుందో మనకు తెలియదు. ఆ పిలుపు వచ్చినప్పడు "నాకు వీలుపడదు" అని శెలవు పెట్టడానికి వీలులేదు. మనము సరళంగా, సహజంగా మంచిగా జీవిస్తూ అనుక్షణము ఆ దేవుని పిలుపు కోసము సిద్ధముగా ఉండాలి.

# 17. ధైర్యము

కుక్క మనల్ని తరుముకు వస్తున్నప్పడు మనము పరుగెడితే అది వెంటబడి కరుస్తుంది. మనము ధైర్యముగా నిలబడితే - అది ఆగిపోతుంది. అదే విధముగా ధైర్యవంతుడే ఈ లోకాన్ని జయించగలడు. ప్లేగ్రౌండులో ఫుట్‌బాలును తన్నినట్లు ఎవడైతే ఈ లోకాన్ని తన్నగలడో -

వాడే నిజమైన ధైర్యవంతుడు. వాడు మాత్రమే - ఈ ప్రకృతి ప్రలోభాలలో నుంచి బయటపడగలడు, స్వేచ్ఛా మండల ములో ప్రవేశించగలడు. ధైర్యము లేనివాడు హృదయ దౌర్భల్యము నుండి బయటపడలేడు. ప్రపంచములోనున్న సంపద ధైర్యవంతునికే సొంతమౌతుంది. పక్షి ఆకాశము లో విహరించటానికి రెండు రెక్కలూ ఎంత ముఖ్యమో - మీకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటే - ఒకటి ధైర్యము, రెండు ప్రేమ చాలా ముఖ్యము. మీరు పవిత్రతలో ఏ స్థాయి వరకు ఎదుగుతారో - ఆ స్థాయి వరకే మీరు ధైర్యములో ఎదుగుతారు. "అన్ని రోగాలకూ ఒక్కటే మందు - అదే ధైర్యము" అన్నాడు భీష్మాచార్యులు.

## 18. శుచి

శుచి లేనివాడికి గతిలేదు. మనము అందరమూ దేహాన్ని శుచిగానే ఉంచుకుంటున్నాము. కానీ శారీరక శుచి కంటే బుద్ధిలో శుచి ముఖ్యము. మనకు పొట్ట విషయములో ఉన్న శ్రద్ధ బుద్ధి విషయములో లేదు. దేహములోనున్న దోషములు స్మశానములోనే కాలిపోతా యి. కాని, బుద్ధిలోనున్న దోషములు స్మశానములో కాలవు - అవి మరుజన్మకు కూడా మీతో వస్తాయి. బుద్ధిని శుద్ధి చేసుకోని జీవుడు - ప్రకృతి కౌగిలిలోనుంచి బయట

పడలేడు, జ్ఞానములో ఎదగలేడు, దేహాత్మభావనను తొలగించుకోలేడు. కనుక మీరు విన్నా, చూసినా, చేసినా, పవిత్రతను గురించే ఆలోచించండి - మీరు పవిత్రులు అవుతారు. ఎవరైనా మీ దేహాన్ని చంపగలరు కాని - మీలోని పవిత్రతను ఎవరు చంపగలరు? పవిత్రత లేని వాడు ఆత్మ విచారణ చేయలేడు. విచారణ రైలు ఇంజను అయితే - పవిత్రత రైలు పట్టాలు వంటిది. రైలుపట్టాలు లేకుండా రైలు ఇంజను కదులుతుందా? మీలో పవిత్రత కనుక లేకపోతే - మీరు ఆత్మ విచారణ చేయలేరు, మీ హృదయగుహలో మీ మనస్సును నిలబెట్టి ఆత్మనిష్ఠలో ఉండలేరు.

# 19. పాపము

దేవుడు ఏ పనులైతే చేయవద్దని చెప్పాడో ఆ పనులే మనము చేస్తున్నాము - ఏ పనులైతే చేయమని చెప్పాడో ఆ పనులు చేయుట లేదు. అది మన బలహీనత! మనలోనున్న బలహీనతలే పాపాలు. పాపమే భేదబుద్ధికి కారణము. పాపములోనుంచే దుఃఖము వస్తున్నది. దౌర్భల్యానికి మూలము పాపమే. భయానికి మూలము పాపమే! పాపమున్న మనిషి సత్యమును గురించి వినలేడు - సత్యాన్ని చూడలేడు. పాపము అశాంతికి గురి చేస్తుంది.

హృదయములో శాంతి లేనివాడు పాపముతో పోరాడలేడు. మర్యాద గురించి, మన్నన గురించి, హుందాతనము గురించి, క్రమశిక్షణ గురించి, సహృదయము గురించి పాపికి తెలియదు. పాపి పరలోకంలో ప్రవేశించలేడు - అధోలోకాలే వాడికి గతి.

# ౨౦. గుణ సంపద

రూపము కంటే గుణము గొప్పది. గుణము కంటే జ్ఞానము గొప్పది. గుణము లేనివాడికి జ్ఞానము కలుగదు. జ్ఞానములేని జన్మ వ్యర్థము. సుగుణములు వివేకమును పెంచుతాయి - దుర్గుణములు అవివేకమును పెంచు తాయి. సుగుణములు ఉన్నవారు మహాత్ములు అవుతారు - దుర్గుణములు ఉన్నవారు దురాత్ములు అవుతారు. సుగుణములు బుద్ధిని శుద్ధి చేస్తాయి - ఆత్మ పదవిని, ఆనంద పదవిని సాధించి పెడతాయి. సుగుణములు లేనివారు సత్య సాక్షాత్కారమును పొందుట సాధ్యము కాదు. సుగుణ సంపదకు మించిన సంపద లేదు - ఆత్మ లాభమునకు మించిన లాభము లేదు. సుగుణముల వలన మనస్సు బంగారమౌతుంది. ధైర్యము లేనివాడికి సుగుణ సముపార్జన సాధ్యము కాదు. గుణవంతులే భవిష్యత్తులో ఉజ్వలముగా ప్రకాశిస్తారు - గుణహీనుల

బ్రతుకులు భవిష్యత్తులో చితికిపోతాయి.

# 21. లోదృష్టి

దూరదృష్టి కంటే - లోదృష్టి గొప్పది. దూరదృష్టి వలన మీరు ప్రాపంచికముగ పైకి రావచ్చును. కాని లోదృష్టి వలన మీరు ఆత్మను దర్శిస్తారు. మీరు సహజంగా సరళంగా జీవిస్తే మీ హృదయ కవాటాలు తెరుచుకుంటాయి - మీ హృదయములో ప్రకాశిస్తున్న సత్యమైన ఆత్మ అనుభవమౌతుంది.

# 22. బుద్ధి కుశలత

కారును నడిపే డ్రైవరులాంటిది - మీ బుద్ధి! డ్రైవరు సరిగా లేడనుకోండి - మీ కారు గమ్యం చేరుతుందా? మనము కళ్ళతో చూస్తున్నాము; చేతులతో పని చేస్తున్నాము - అదేవిధముగా మనము బుద్ధితోటి ఆలోచించుటకూడా నేర్చుకోవాలి. శారీరకమైన సోమరితనముకంటే బుద్ధికి సంబంధించిన సోమరితనము మరింత ప్రమాదకరమైనది. ఏది చూసినా, ఏది చేసినా, ఏది విన్నా - మీ సొంతబుద్ధిని, పరిశీలనా దృక్పథాన్ని మీరు విడిచిపెట్టకండి. బుద్ధిలో సోమరితనానికి అలవాటుపడిన వ్యక్తిగాని, జాతిగాని దోపిడీకి గురి అవుతారు. కనుక

అన్ని విధములా ప్రయత్నము చేసి మీ బుద్ధిబలమును పెంచుకోండి. బుద్ధి శుద్ధిలేకపోతే దారి దొరకదు. సత్యాన్వేషణకు బుద్ధి సూక్ష్మత చాలా ముఖ్యము. సూక్ష్మ బుద్ధికి స్వరూపము అందుతుంది గాని - స్థూలబుద్ధికి స్వరూపము అందదు. పుస్తకములలోనున్న దానిని మీ మస్తకములోనికి తెచ్చుకుంటే - మీ బుద్ధి వికసిస్తుంది - ఈశ్వరునిపట్ల మీకు భక్తి కుదురుతుంది. ఈశ్వరభక్తి మీ బుద్ధిలోనున్న దోషములను తొలగిస్తుంది - మీకు శాంత బుద్ధిని ప్రసాదిస్తుంది. శాంత బుద్ధి లేకుండా ఆధ్యాత్మిక రంగములో అభివృద్ధి సాధ్యముకాదు. శాంత బుద్ధి కలవాడే ఈ భూమి మీద నిజమైన అదృష్టవంతుడు. బుద్ధిమంతుడికి అహంకారము యొక్క విజృంభణ తగ్గుతుంది - వాడు ఫలాసక్తి లేకుండా పనిచేస్తాడు - నిర్వికారరంగా ఉండగలుగుతాడు. నిర్మలబుద్ధిలేనివాడు సంఘసేవకు పనికిరాడు.

# 23. నిదానము

చిన్న చిన్న పాత్రలు తొందరగా వేడెక్కుతాయి. అదే విధముగా సంకుచిత మనస్సులు కలవారు తొందరగా ఆవేశానికీ, ఆందోళనకు గురి అవుతారు. ఆధ్యాత్మిక మార్గములో పయనించే వారికి మనస్సు, శరీరము వేడెక్క కూడదు. ఆధ్యాత్మిక వికాసానికి ఆవేశము కంటే - ఆలోచన చాలా ముఖ్యము. మీరు జ్ఞానములో ఎదగాలంటే - మీ దేహానికి ఆరోగ్యము, మీ మనస్సుకు అదుపు అవసరము. ఎదుటివారు మిమ్మల్ని కలతపెట్టినప్పటికీ - మీరు కంగారు పడకండి. అన్ని దానములలోకీ నిదానము గొప్పది. నిదానము అభ్యాసము వలన వస్తుంది గాని - ప్రపంచమునకు దూరమగుట వలన రాదు. మీరు ఎంత వరకూ పక్వానికి వచ్చారో పరీక్షించుటకు - మీ మనస్సును నొప్పించే మాటలను ఎదుటివారిచేత ఆ దేవుడే అనిపిస్తుంటాడు. అంత మాత్రముచేత ఆ మాటలకు మీరు కంగారు పడి, ఆవేశపడకండి. ఆవేశము ఆలోచనను చంపి వేస్తుంది. ఆలోచనలో నిదానము లేని మనిషి సత్యాసత్యములను వేరుచేయలేడు.

# 24. ప్రారబ్ధము

ప్రారబ్ధము కేవలము దేహమునకే పరిమితము - ఆత్మకు సంబంధము లేదు. మానవుడు ఆత్మగానే యున్నాడు. అయితే ఆత్మతో తాదాత్మ్యము పొందకుండా దేహముతో తాదాత్మ్యము పొందుట వలన దుఃఖమును అనుభవిస్తున్నాడు. సాధన చేసి, వివేకముతో మనస్సును శుద్ధిచేసుకొని, ఆత్మను గ్రహించే స్వేచ్ఛను మాత్రము దేవుడు జీవులకు ఇచ్చాడు. సాధన వలన దేహ ప్రారబ్ధాన్ని తప్పించుకోలేము కాని - మనస్సును మాత్రము సంస్కరించుకోగలము. సంస్కరింపబడిన మనస్సు ఆత్మాకారము చెందుతుంది. ఏ ప్రారబ్ధమును అనుభవించుటకు మీ దేహము తల్లి గర్భములో నుంచి బయటికి వచ్చినదో - మీ ఇష్టాయిష్టములతో నిమిత్తము లేకుండా - ఆ ప్రారబ్ధాన్ని అనుభవించిన తరువాత మీ దేహము రాలిపోతుంది. వ్యర్థమైన చింతనలకు, వ్యర్థమైన కర్మలకు, వ్యర్థమైన కోరికలకు మీ హృదయ ములో చోటు యివ్వకండి. మీకు వచ్చే ప్రతి చిన్న తలంపు నకు కూడా మీరు ఏదో ఒక జన్మలో సమాధానము చెప్పి తీరాలి. దేవుడు ఇచ్చిన స్వేచ్ఛను ఉపయోగించుకోండి. మీ బుద్ధికి పని చెప్పండి. మీకు వచ్చే ప్రతీ తలంపును మీ హృదయములోనే నిరోధించి,

మీరు ఆత్మనిష్టలో ఉండ గలిగితే - మీకు కొత్త వాసనలు పుట్టవు; ఉన్న వాసనలు పలుచబడతాయి; మీరు బంధములోనుంచి బయట పడతారు. దేహతాదాత్మ్యమును త్యజించలేకపోతే ఏనాటి కైనా ప్రమాదము తప్పదు - దుఃఖభారమును భరించక తప్పదు. సత్పురుషులతో సహవాసము చేస్తే మనస్సు పరి శుద్ధమై దేహబుద్ధి విడిచిపెడుతుంది. జన్మ జన్మల నుండి అంతఃకరణమును అంటిపెట్టుకొని యున్న కోరికలు రాలి పోతేనేగాని ఆనంద స్థితి, అమృతస్థితి కలుగదు - తత్వము తెలియదు. తత్వమును (తాను ఆత్మ స్వరూపుడనని) గ్రహించిన వాడికి ప్రారబ్దము యొక్క తాకిడి తగలదు. ఆత్మ నిష్ట కుదిరినవాడికి ప్రారబ్దము ఎక్కడ వుంది? దేహానికి ప్రారబ్ధము గాని - ఆత్మకు ప్రారబ్ధమేమిటి? నీవు ఆత్మవు గాని - దేహానివి కాదుగా!

## 25. అజ్ఞానము

మనిషిని బంధిస్తున్నది అజ్ఞానవేగాని - సంసారము కాదు. అహంకారమును అతిక్రమించలేని మానవుడు అజ్ఞానమనే సుడిగుండములో నుంచి బయట పడలేడు. సుడిగుండములో పడ్డ గడ్డిపరకలు ఏ విధముగా తిరుగుతాయో - అదేవిధముగా అజ్ఞానము

జీవులను ఆడిస్తున్నది. అజ్ఞానము ఉన్నంతకాలమూ ఏ జీవుడిని మోహము విడిచిపెట్టదు. మోహము ఉన్న మనిషి పాపము చేసి తీరతాడు. స్వార్థానికి మించిన పాపము లేదు. స్వార్థపరుడు సమాజానికి చీడపురుగులాంటివాడు. మనస్సు అదుపులో నున్న మనిషి మాత్రమే పాపదూరుడు కాగలడు. పాపము ఏ రూపములో ఉన్నప్పటికీ దానిని తొలగించుటకు సహాయపడువాడే నిజమైన గురువు.

## 26. జ్ఞానమే గమ్యం

జ్ఞానము ఒక్కటి మాత్రమే శాశ్వతమైనది. జ్ఞానమునకు వేరుగా మోక్షము లేదు. సమాజములో శాంతి భద్రతలు కాపాడుటకు పోలీసుబలగము ఎంత ముఖ్యమో - మానవ మానసాన్ని శాంతితో, కాంతితో నింపుటకు జ్ఞానుల బోధ కూడా అంతే ముఖ్యము. మానవుడిని అజ్ఞానమనే అంధకారములో నుంచి జ్ఞానమనే వెలుగులోనికి నడిపించుటకే అవతార పురుషులు, ఆచార్యులు, జ్ఞానులు ఈ భూమిమీద అవతరించారు. మతాలు పుట్టినవికూడా ఇందుకే! ఆకలి తీర్చే అన్నదాతకంటే - అజ్ఞానము పోగొట్టే జ్ఞానదాత మిన్న! జ్ఞానము పొందకుండా మనిషి మరణిస్తే - అపారమైన కష్టానికీ, నష్టానికీ గురి అవుతాడు. జ్ఞానము పొందని

వాడికి ప్రకృతి దారి ఇవ్వదు - వాడు భవిష్యత్తులో ఎన్నో శవాలను మోయవలసి వస్తుంది. కనుక అజ్ఞానముతో జన్మించినా - జ్ఞానముతో మరణించాలి! ఏడుస్తూ పుట్టినా - నవ్వుతూ చావాలి! జ్ఞానముతో సమానమైనది ఈ లోకములో గాని, పరలోకములోగాని లేదు. మానవుడిని దుఃఖ స్పర్శలేని స్థితికి తీసుకువెళ్ళగలిగేది ఒక్క జ్ఞానము మాత్రమే. జ్ఞానము కర్మాగారాలలో ఉత్పత్తి అయ్యేదికాదు. మానవుని స్వరూపమే జ్ఞానము! ఆత్మ విచారణ చేస్తే స్వరూపము తెలుస్తుంది. తన స్వరూపమును విడిచిపెట్టి ప్రయోగశాలల్లో పరిశోధనలు చేస్తే - మానవుడు శారీరక భోగములను పొందగలడేగాని - శాంతిని మాత్రము పొందలేడు. నిజమైన శాంతి ఒక్క ఆత్మలోనే ఉంది. ఆత్మను దర్శించేవరకూ ఏ జీవుడినీ దుఃఖము విడిచి పెట్టదు. భోగము వలన ఇంద్రియములు చల్లబడతాయే గాని - హృదయము మాత్రము చల్లబడదు. ఆత్మదర్శనము అయిన వాడికి మాత్రమే హృదయము చల్లబడుతుంది. జాతి గమ్యము జ్ఞానమే - భోగము కాదు. గడ్డిమేటు ఎంత పెద్దదయినప్పటికీ ఒక్క అగ్గిపుల్లతోనే ఎలా కాలిపోయి బూడిదౌతుందో - అదేవిధముగా జ్ఞానము కలిగిన తరువాత మీలో ఎంత అజ్ఞానము ఉన్నప్పటికీ అది కాలిపోయి బూడిదౌతుంది.

జ్ఞానము కలుగుటకు - స్వప్రయత్నము, కాల పరిపక్వము, ఈశ్వర కటాక్షము కలిసిరావాలి. చెరువులో నున్న చేపను గట్టుమీద వేస్తే - అది నీటికోసము ఎంత తహతహలాడుతుందో - నీటిలో ముంచబడిన వ్యక్తి గాలి కోసము ఎంత తపన బడతాడో - అంత తీవ్రతపన దేవుని కోసం ఎవడు పడతాడో - వాడికి మాత్రమే జ్ఞానం కలుగుతుంది. "జీవితం కేవలము ఒక స్వప్నము మాత్రమే"నని గ్రహించిన బుద్ధిమంతుడు మాత్రమే అజ్ఞానములోనుంచి బయటపడతాడు - జ్ఞానగంగను గ్రోలతాడు - శాంతి శిఖరాలను చేరుకొంటాడు - ఆనంద సాగరంలో మునిగి పోతాడు.

# 27. జ్ఞాన సముపార్జన

కాషాయము కట్టిన ప్రతివాడు సన్యాసి కాడు - కర్తృత్వమును విడిచిపెట్టినవాడే నిజమైన సన్యాసి. కర్మేంద్రియములను బంధించినంత మాత్రాన వాడు జ్ఞాని కాదు - వాసనా క్షయమైనవాడే నిజమైన జ్ఞాని. పూజ, జపము, ధ్యానము, ఆత్మ విచారణ - ఇవన్నీ చిత్తశుద్ధికి సహకరిస్తాయి. కోరికయందు ఆసక్తి లేకుండా కర్మను ఆచరిస్తే వాసనలు నశిస్తాయి. దైవము అంతటా వ్యాపించి ఉన్నదనే విషయమును గుర్తించిన మానవుడికి -

దైవానుగ్రహము లభిస్తుంది. ఆ గుర్తింపు కూడా ఒక యోగమే! యోగము మనస్సును సంస్కరించుకొనుటకు, సరళముగా జీవించుటకు సహకరిస్తుంది. లోకకళ్యాణము కోసము శరీరమును, మనస్సును అర్పించి పనిచేసిన పుణ్య పురుషులకు, జ్ఞానోదయమౌతుంది. ఈశ్వరుని ఉనికిపట్ల సజీవమైన విశ్వాసము లేకపోతే - ఈశ్వర సాక్షాత్కారము సాధ్యము కాదు.

## 28. మానవ జన్మ

అసత్యమునుండి బయటపడి, సత్యమును దర్శించుటకు సాధకుడికి తన శరీరమును ఒక వంతెనలా ఉపయోగపడుతుంది. మరణించే మీ శరీరము మరణించకముందే - మీ హృదయములో నున్న మరణములేని ఆత్మను మీరు దర్శించండి. ఈ మానవ జన్మ ఒక రైలు జంక్షను లాంటిది. మానవజన్మ రావటము, భగవంతుని యందు భక్తి కలగటము, సత్పురుషుని సాన్నిధ్యము దొరకటము, మంచి మాటలు వినాలనే ఆసక్తి కలగటము ఎన్నో పూర్వ జన్మల పుణ్య ఫలము. అన్ని జన్మలలోకీ మానవ జన్మ ఉత్కృష్టమైనది అన్నారు - ఎందుకని? జీవుడు తరించాలంటే సాధన చేసి తీరాలి. సాధన చేసే అవకాశము ఒక్క మానవ జన్మకే ఉంది - మిగిలిన

జీవులకు ఆ అవకాశము లేదు. అట్టి ఉత్కృష్టమైన మానవ జన్మనెత్తి మోక్షము పొందని వాడికి మరల దేహమునిచ్చి శిక్షిస్తాడు దేవుడు.

# 29. దైవ స్మరణ

మీకు ఇష్టమైన దేవుని నామాన్ని మీరు ప్రీతితో నిరంతరము స్మరించినా మీకు మోక్షము వస్తుంది. స్మరణ స్నానము వంటిది. అది మీ మనస్సును శుద్ధి చేస్తుంది. పరిశుద్ధ మనస్సుకు గాని పరమాత్మ దర్శనముకాదు. “అమ్మా అమ్మా” అని మీ బిడ్డ రోదిస్తుంటే... ఆ బిడ్డ మీదకు మీ మనస్సు ఎలా పరుగెడుతుందో - అదేవిధముగా మీరు నిరంతరము దేవుని స్మరించుట వలన దైవానుగ్రహము మీపైన వర్షిస్తుంది. స్మశానములో శవమును కాల్చేటప్పుడు ఆ చితిని ఎగత్రోసే కట్టెకూడా చివరికి ఆ మంటలలో ఎలా కాలిపోతుందో - అదేవిధముగా మీరు స్మరణ చేయుగా, చేయుగా మీలో జ్ఞానాగ్ని పుడుతుంది. ఆ జ్ఞానాగ్నిలో మీలోని స్మరణ చేసేవాడు కూడా చివరికి కాలి పోతాడు. మోక్ష సుఖం మీచేతికి అందుతుంది - మీకు సిద్ధి కలుగుతుంది.

# 30. యోగసారము

కర్మ యోగము ఫలితాన్ని ఆశించకుండా పని చేయమని; భక్తి యోగము "నన్ను నీలో కలుపుకో"మని; ధ్యాన యోగము మనస్సును ఏకాగ్రపరచి, ఇంద్రియము లను నిగ్రహించి, ప్రాణశక్తిని పెంచుకోమని; జ్ఞానయోగము సత్యాసత్యములను వేరుచేసి, అసత్యములో నుంచి బయట పడమని చెపుతున్నాయి. జ్ఞాన మార్గములో పయనించే వాడు ఈ సృష్టిలో ఏ వస్తువూ తనది కాదనుకుంటాడు - కర్మ మార్గములో పయనించేవాడు ఈ లోకమంతా తనదే ననుకుంటాడు. కాని శ్రీ రమణ స్వామి చెప్పినది - విచారణ మార్గము. విచారణ మార్గమంటే - మనస్సును ఆత్మలోనికి ఉపసంహరించుట. వీటి అన్నిటి యొక్క గమ్యము ఆత్మను దర్శించుటయే.

# 31. భక్తి వైభవము

ఆధ్యాత్మిక రంగములో పయనించేవాడికి - అయిన వారు సహకరించరు - బంధుమిత్రులు సహక రించరు - ప్రజలు సహకరించరు, ఇంటిలోనివారే ముందు గా విరోధులు అవుతారు. అందువలన ఒంటరిగానే ప్రయాణము చేయవలసి ఉంటుంది. దానికి ధైర్యము

కావాలి. దైవము పట్ల మీకున్న నిర్మలమైన, నిశ్చలమైన భక్తి ఒక్కటే మీకు సహకరిస్తుంది. భగవంతుడిని నిరంతరమూ గుర్తు ఉంచుకొనుటయే భక్తి. భక్తి అంటే సామాన్యము కాదు - అది గొప్ప ఆయుధము లాంటిది. భక్తి అనే ఆయుధము - పాపములను, దోషములను దహిస్తుంది; అజ్ఞానమును అంతము చేస్తుంది.

# 32. మాయ

మాయ మన మనస్సు రూపములోనే ఉంది. అది దేహమును, లోకమును కల్పిస్తుంది; భేదమును సృష్టిస్తుంది. దుఃఖమును తీసుకువస్తుంది. మాయ అనేక రకములుగా ఉంటుంది. మాయను, ఆత్మను మిశ్రమము చేయలేము. "నేను" అను ప్రథమ సమస్యను విడిచిపెట్టి - "నేను" వచ్చిన తర్వాత కనిపిస్తున్న దేహము గురించి, లోకము గురించి చింతిస్తున్నాము. అన్నీ అడుగుతున్న ఈ "నేను" ఎవరో అడుగుట అవసరము. ఈ నేనుకు ఐకమత్యము కంటే - విడితనమే ఎంతో మక్కువ. మాయ కారణముగా మనకు "నేను ఎవడను?" అన్న ప్రశ్న ఉదయించుట లేదు. మాయ ఈశ్వరుని చేతిలో ఉంటే - మాయ చేతిలో మనము ఉన్నాము. మనలో జీవలక్షణములు ఉన్నంత కాలమూ - మాయ మనల్ని

ఎప్పుడు మింగివేస్తుందో, అజ్ఞానము ఏ రూపములో కాటువేస్తుందో చెప్పలేము. అందుచేత మనము ఈ మాయలో నుంచి బయట పడాలంటే - ఈ శరీరములో ప్రాణము ఉన్నంతవరకూ - పరమేశ్వరుని పాదాలు విడిచిపెట్టకూడదు. మనము ఈ మాయను దాటనంతకాలమూ ఉన్న ఆత్మ లేదనిపిస్తుంది - లేని లోకము ఉందనిపిస్తుంది.

# 33. శ్రవణము

దారిద్ర్యముతో బాధపడుతున్న వాడికి భాగ్యమువస్తే - ఆ భాగ్యము వాడి దారిద్ర్యాన్ని ఎలా ప్రక్కకు గెంటివేస్తుందో - అదే విధముగా మీరు ఆత్మను గురించి శ్రద్ధగా శ్రవణము చేయగా చేయగా మీకు జ్ఞానము కలుగుతుంది. ఆ జ్ఞానము మీలోని అజ్ఞానమును సమూలముగా పెకిలించి అవతల పారవేస్తుంది. కాని నేటి సమాజములో నున్న దురదృష్టము ఏమిటంటే - పూజలు చేయమంటే చేస్తారు, కొబ్బరికాయలు కొట్టమంటే కొడతారు. లక్షవత్తులు వెలిగించమంటే వెలిగిస్తారు - కాని శాస్త్రాన్ని శ్రవణము చేయమంటే చేయరు. ఒక రాయికి ఇస్తున్న విలువను ఒక ఆచార్యునికి ఇవ్వరు. ఒక రాయికి ఇస్తున్న విలువను ఒక అవతార పురుషునికి ఇవ్వరు. ఒక రాయికి ఇస్తున్న

విలువను ఒక జ్ఞానికి ఇవ్వరు. ఇది మన దురదృష్టము. రాతి విగ్రహములో మాత్రమే దేవుణ్ణి చూసేవాడు హృదయములో ప్రకాశిస్తున్న దేవుణ్ణి చూడలేడు. అంత మాత్రముచేత విగ్రహారాధన తప్పనీకాదు - రాతి బొమ్మలో దేవుడు లేడనీ కాదు. దేవుడు అంతటా ఉన్నాడు. అంతటా ఉన్న దేవుడు నీ హృదయములో కూడా ఉన్నాడు. ఈ విషయమును మరచిపోయి దేహము నీవు అనుకొంటున్నావు. నీ దేహ పరిమిత బుద్ధి నుంచి నిన్ను బయటికి తీయుటకే - దేవుణ్ణి రాతి బొమ్మకు పరిమితము చేసి చూపారు మన పెద్దలు. రాతి బొమ్మలో దేవుణ్ణి చూడగలిగితే - రాతి మనస్సులు కూడా బంగారు మనస్సులుగా మారతాయి. విగ్రహాల వలన నిగ్రహము వస్తే - విగ్రహారాధన యొక్క ప్రయోజనము నెరవేరుతుంది. దైవమునకు నీవు దూరముగా ఉన్నంత కాలమూ దుఃఖము అనుభవించక తప్పదు. ఆయన స్వరూపములో చేరుకుంటే దుఃఖము నిన్ను విడిచిపెడుతుంది.

# 34. సాధనా క్రమము

చేతితో చేసే పూజ కంటే - నోటితో చేసే జపము గొప్పది. నోటితో చేసే జపము కంటే మనస్సుతో చేసే ధ్యానము గొప్పది. మనస్సు చేసే ధ్యానము కంటే - బుద్ధితో

చేసే విచారణ గొప్పది. ధ్యానాదుల వలన ఇంద్రియములు అణుగుతాయేగాని - వాసనాక్షయము కాదు. ఇంద్రియములు ఉడిగినవాడు మాత్రమే జ్ఞాని కాగలడుగాని - అణిగినవాడు మాత్రము కాదు. అణిగిన ఇంద్రియములు చుట్టచుట్టుకున్న పాము వంటిది. అవి తిరిగి విజృంభించక మానవు. కాని విచారణ చేయుట వలన దేహబుద్ధి తగ్గి ఆత్మబుద్ధి పెరుగుతుంది - బంధములో నుంచి బయట పడతారు.

# 35. తపస్సు

మనకు వచ్చు తలంపులలో "నేను" అనునది ప్రథమ తలంపు. ఈ "నేను" నుంచి విడుదల పొందుటకు చేయు ప్రయత్నమే తపస్సు. వాక్కును నియమించి వాక్కును స్వాధీనము చేసుకోవాలి. ఇంద్రియములను నిగ్రహించి ఇంద్రియాలను స్వాధీనము చేసుకోవాలి. మనస్సును నిరోధించి మనస్సును స్వాధీనము చేసుకోవాలి - అదే తపస్సు! తపస్సు వలన తత్వము వ్యక్తమౌతుంది. "నేను ఎవడను?" అని విచారణ చేసి, మనోమూలాన్ని తెలుసుకుంటే మనస్సుకు స్వస్థత చేకూరుతుంది - సత్యము తెలుస్తుంది. సత్యము మానవుడిని బంధములోనుంచి విడుదల చేస్తుంది.

ఉన్నతమైన, ఉదాత్తమైన ఆధ్యాత్మిక జీవితములో ప్రవేశించు టకు "నేను ఎవడను?" అను ప్రశ్న మొదటిమెట్టు. దేహము మరణించకముందే ఈ ప్రశ్నకు సమాధానము తెలిసిన వాడు చివరిమెట్టును చేరుకుంటాడు. ఈ ప్రశ్నకు సమాధానము అన్వేషించుటకు జీవితము నుండి గాని, బాధ్యతలను విడిచిపెట్టిగాని పారిపోవలసిన పనిలేదు. "నేను ఎవడను?" అను ప్రశ్నకు సరియైన సమాధానము దొరికిన వాడికి ఆత్మ శాంతి కుదురుతుంది. శాంతి వస్తుంటే ఆహ్వానించకుండా ఎవరు ఉండగలరు? జీవించి ఉండగానే మృత్యుదేవత యొక్క ఇంటికి వెళ్ళి చూసి, తిరిగి వచ్చిన వాడికి శాశ్వత శాంతి చేకూరు తుంది. రాక్షస ఆరాధనకంటే - విగ్రహారాధన, దేవాతారాధ న మంచిది. సత్యాన్వేషణకు దేవతారాధనకంటే - "నేను ఎవడను?" అను ప్రశ్న ఎక్కువగా సహకరిస్తుంది. సత్యము ను తెలుసుకోకుండా - స్వేచ్ఛను గాని, శాంతినిగాని, సుఖమునుగాని పొందలేము.

## 36. ఎలా జీవించాలి

మంచిగా జీవించుటకంటే మించిన తపస్సు లేదు. మనిషిగా పుట్టిన ప్రతివాడు మంచిని చేయుట నేర్చు కోవాలి. మంచిని చేయాలి - చేసిన మంచిని మరచి పోవాలి.

మంచిగా జీవించుటకంటే మించిన యోగము లేదు. మంచిగా జీవిస్తే మనస్సులోని మాలిన్యము పోయి, మోక్షము వైపు దారి కనిపిస్తుంది. మనస్సుతో గాని, మాటతో గాని, దేహముతోగాని ఎవ్వరినీ హింసపెట్ట కూడదు. ఎదుటి వారిని హింసపెడితే - పరిణామములో మనము హింసకు గురికాక తప్పదు. ఈ జన్మలో మనము చేసిన పనులే - మరుజన్మలో మనకు ఎదురు వస్తాయి. ఏదైతే హృదయములో ఉందో - అదే చెప్పాలి. ఏదైతే చెపుతున్నామో - అదే చేయాలి. న్యాయమైన మార్గములో నడుచుకుంటూ, కపటము లేకుండా జీవిస్తూ, సత్ప్రవర్తన కలిగి ఉంటే - మీ ఇంద్రియములు మీకు స్వాధీనములోకి వస్తాయి. స్వాధీనమైన ఇంద్రియములు కలవాడు ఈ సృష్టిలో సాధించలేనిది ఏమున్నది?

# 37. రంధ్రాన్వేషణ

ఎదుటివారిలోని లోపములను వెదకుట మాని వేయండి. ఎదుటివారిలో ఏ లోపములైతే మీకు కనిపిస్తున్నాయో - వాటికి సంబంధించిన సంస్కారము మీ హృదయములో లేకపోతే ఆ లోపము మీకు కనిపించదు. మీకు చేతనైతే మిమ్మల్ని మీరు సంస్కరించుకొని, ఎదుటి వారిని కూడా సంస్కరించి, వారిని బలవంతులుగా తీర్చి

దిద్దండి. విమర్శకంటే సంస్కరణ గొప్పది. కూల్చుటకంటే నిర్మించుట మంచిది. మన ముఖములో లేని అందము అద్దములోని మన ప్రతిబింబములో కనిపించదు. మీరు పవిత్రులు కాకపోతే - లోకములోని పవిత్రతను మీరు చూడలేరు. కనుక రంధ్రాన్వేషణను విడిచిపెట్టి, సంస్కరణను మీ దగ్గర నుంచే ప్రారంభించండి. మీరు ఎంత వరకూ పవిత్రులైతే - అంతవరకే మీరు సమాజానికి ఉపయోగపడతారు. రంధ్రాన్వేషణ వలన మీ మనస్సు మలినమైపోతుంది.

## 38. ద్రోహ చింతన

ద్రోహ చింతన ఉన్నవాడి మనస్సు కుళ్ళిపోతుంది. వాడికి ప్రశాంతి ఉండదు - లోకమునకు అశాంతిని తీసుకువస్తాడు. సమాజానికి చేయగలిగితే మంచినే చేయాలి - మంచిని చేయలేకపోతే కనీసము మంచి జరుగుతుంటే చూసి సంతోషించాలి. దాని వలన కూడా పుణ్యము వస్తుంది. ఎదుటివారు దూషించినప్పటికీ, ద్వేషించినప్పటికీ తిరిగి ప్రతీకారము చేయగల శక్తి మీకు ఉన్నప్పటికీ - ద్రోహము తలపెట్టకూడదు. ద్రోహబుద్ధి కలవాడు దురాత్ముడౌతాడు గాని - మహాత్ముడు కాజాలడు. ద్రోహికి దైవము సాక్షాత్కరించదు.

# 39. కీర్తికాంక్ష

మీరు గౌరవము పొందాలని అనుకోవటము కూడా ఒక మానసిక వికారమే! కాలక్రమములో ఆ వికారమే ఆవేశముగా మారుతుంది - అనర్థాలకు దారి తీస్తుంది, ఆత్మకు దూరము చేస్తుంది. "వేము అధికులము. ఇతరులు మమ్ములను గౌరవించాలి" అని అనుకోవటము బానిసత్వము. అది అహంకార లక్షణము. అహంకారానికి ఇతరులు ఉన్నారు గాని - ఆత్మకు ఇతరులు ఉన్నారా? అహంకారమునకు దృశ్యము ఉన్నది కాని - ఆత్మకు దృశ్యము లేదు. ఉన్నది ఒక్కటే వస్తువు. దానిని గ్రహించిన బుద్ధిమంతుడు పూజింపబడాలనే తలంపులో నుండి బయటపడతాడు.

# 40. భయము

మీరు జ్ఞానము పొందకుండా, అమృత స్థితిని అందుకోకుండా, శాంతి శిఖరాన్ని చేరుకోకుండా మీరు చేస్తున్న పాపమే భయము రూపములో మీకు అడ్డుపడు తున్నది. భయానికి మూలము పాపమే! పాపదూరుడు కానంత కాలమూ ఏ జీవుడూ భయము కౌగిలిలో నుంచి బయటపడలేడు. దేహముతో, కుటుంబముతో, కులముతో

మతముతో మనిషి తాదాత్మ్యము పొందుతున్నంతకాలము భయము వెంటాడుతూనే ఉంటుంది. సత్యవస్తువును దర్శించే వరకూ అభయస్థితిని అందుకోలేడు. అభయ స్థితిని అందుకునేవరకూ దుఃఖము వెంటాడుతూనే ఉంటుంది. భయము జీవ లక్షణము. ఆత్మకు భయము లేదు. మీకు దేహగతమైన అనుభవముంది - అది పరిమిత మైనది. మీకు మనోగతమైన అనుభవముంది - అదికూడా పరిమితమైనదే. మీలో ఆత్మ ఉంది - అది అపరిమితమైనది. కాని దానికి సంబంధించిన అనుభవము మీకు లేదు. అది మీకు స్ఫురిస్తే మీకు అభయ స్థితి కలుగుతుంది. మీ స్వరూపాన్ని మీరు మరచిపోయి - దేహావే మీరనుకొని - మీ మనస్సు చుట్టూ, ఇంద్రియముల చుట్టూ తిరుగుతున్నంత కాలమూ - భయము మిమ్ములను విడిచిపెట్టదు. భయము ఉన్నంత కాలమూ మరణము తప్పదు - మరలా జన్మ తప్పదు. భయమనేది అజీర్తి రోగము వంటిది. అజీర్తి రోగము ఉన్నవాడు ఎంత తిన్నా ఒంటపట్టదు. అదేవిధముగా మీలో ఎన్ని సుగుణములు ఉన్నప్పటికీ మీరు భయపడుతున్నంత కాలము మీ సుగుణములు రాణించవు - మీకు జ్ఞానము కలుగదు. భయపడుతున్నంత కాలము మీరు భగవంతునికి దూరమైపోతారు. నిరంతరము ఆత్మను

ధ్యానించే వాడికి భయపడటానికి ఏముంది?

# 41. ఓర్పు

జీవితములో ఓర్పు చాలా ముఖ్యము. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ ఓర్పుగా ఉండగలగాలి. ఓర్పు వలన నేర్పు వస్తుంది. ఓర్పుగలవాడు వెలుగును చూస్తాడు. ఓర్పులేని జీవి, ఓర్పులేని జాతి నశించిపోతాయి. ఓర్పుగల వాడు జీవితములో జయాపజయములను సహజముగా, సమముగా స్వీకరిస్తాడు. దేహ ప్రారబ్ధమును ఓర్పుగా భరిస్తే - కొత్త వాసనలు పుట్టవు, పాత వాసనలు నశిస్తాయి, శరణాగతి అలవడుతుంది. ఓర్పుగలవాడు మాత్రమే - హృదయపు లోతుల్లోనికి దిగగలుగుతాడు, కామ క్రోధము లను కాల్చి బూడిద చేయగలుగుతాడు. నీరు పల్లమునకు ప్రవహిస్తున్నట్లుగా - ఓర్పు గలవాడినే సత్యము వరిస్తుంది.

# 42. కోపము

కోరికకు మరోపేరు కోపము. కోరిక లేనివాడికి శోకము లేదు. శోకము లేనివాడే నిజమైన సుఖి, కోపం అగ్నివంటిది. అది శరీరమును, మనస్సును దహించి - శారీరక, మానసిక అనారోగ్యమునకు గురిచేస్తుంది. కోప కారణము ఉన్నప్పటికీ ఎవడికైతే కోపము రాదో - వాడి

మనస్సు ఆత్మాకారము చెందుతుంది. ఆత్మసుఖం చేతికి అందేవరకూ ఏ జీవుడినీ కోపతాపాలు విడిచిపెట్టవు.

# 43. మృదుత్వము

ఆత్మ విద్యకు 'మృదుత్వము అత్యంత ముఖ్యము. మృదుత్వము లేనివాడు ముని కాలేడు. మృదుత్వము జీవితానికి నవ్యత్వమును తీసుకువస్తుంది. హృదయపు లోతును పెంచుతుంది. గుండె తలుపును తడుతుంది. మనస్సుకు చల్లదనాన్ని యిస్తుంది. సమాజములో శాంతిని, శక్తిని స్థాపించుటకు ఉపయోగపడుతుంది. మనిషికి, మనిషికి మధ్యన అవగాహన పెంచుతుంది. మృదుత్వము ఉన్న జీవుడు శివుడుగాను, శుకుడుగాను అవుతాడు.

# 44. దయ

భగవంతుని పట్ల మనకున్న ప్రేమను "భక్తి" అంటారు - దీనుల పట్ల మనకున్న ప్రేమను "దయ" అంటారు. దయ దైవీగుణము. దయగల హృదయమే భగవంతుని నిలయము. దయగలవారే ధన్యులు ఈ లోకములో. హృదయములో నిదురిస్తున్న ప్రేమను దయ మేల్కొలుపుతుంది. తోటి ప్రాణులపట్ల మీరు దయ చూపిస్తే - మీ పట్ల దేవుడు దయ చూపిస్తాడు.

# 45. దానము

మీరు ఆడంబరము లేకుండా, ప్రతిఫలాపేక్ష లేకుండా, నిర్మలమైన మనస్సుతో దానము చేస్తే - మీలోని పాపము తగ్గుతుంది, దోషము తగ్గుతుంది, బుద్ధి శుద్ధి అవుతుంది, దైవానుగ్రహము మీ పైన వర్షిస్తుంది. మీరు గొప్పల కోసము దానాలు చేస్తే - చివరికి మీకు పేరులు, ఊరేగింపులు మిగులుతాయి - జీవితములో వికాసము కలుగదు, మరణించిన తరువాత -చీకటి లోకాలు వస్తాయి.

# 46. ధర్మము

సత్యాన్ని ఆచరణలో పెడితే - అదే ధర్మము. ధర్మానికి భిన్నముగా జ్ఞానములేదు - జ్ఞానానికి భిన్నముగా ధర్మములేదు. అవి రెండూ ఒకే నాణానికి బొమ్మా - బొరుసు వంటివి. మానవుడు ధర్మ మార్గాన్ని విడిచిపెట్ట కూడదు. ధర్మాన్ని విడిచిపెట్టిన మానవుడు వివేకవంతుడు కాజాలడు. ధర్మానికి దూరమైన సమాజము సుఖానికి దూరము కాక తప్పదు. తన అల్పత్వాన్ని, స్వల్పత్వాన్ని తొలగించుకొనుటకైనా మానవుడు ధర్మాన్ని ఆశ్రయించాలి. అప్పడే మానవుడు జ్ఞాన శిఖరాన్ని అందుకోగలుగుతాడు. ధర్మమును ఆచరించువానికి మాత్రమే మాయలోనుంచి

బయటపడటానికి దారి దొరుకుతుంది.

## 47. అచాపల్యము

చపలత్వము ఉన్నవాడికి శ్రద్ధ కుదరదు. చపలత్వమున్న మనిషి మాధవుడు కాలేడు. చపలత్వము నకు లోనై పూర్వము దేవతలు కూడా శపించబడ్డారు. మనస్సుతో గాని, ఇంద్రియములతోగాని మనము అవసరము లేని పనులు చేయకూడదు. మనస్సును, ఇంద్రియములను స్వాధీనము చేసుకున్నవాడు మాత్రమే అచాపల్య స్థితిని అందుకోగలడు - కైవల్య ప్రాప్తిని పొంద గలడు. అచాపల్యము ఆర్థిక అభివృద్ధిని సాధించలేకపోయి నా - భువి నుండి దివికి వెళ్ళుటకు వంతెనగా ఉపయోగ పడుతుంది, శాంతి సామ్రాజ్యమును స్థాపించుటకు సహాయపడుతుంది.

## 48. త్యాగము

మీరు దేవుని పటము చెంత అరటిపండు పెడితే అది త్యాగము కాదు - మీ అహంకారాన్ని దేవునికి నైవేద్యముగా సమర్పించాలి - అదీ త్యాగము! మీరు పనిచేసి, ఫలితాన్ని సమాజముకోసము సమర్పించగలిగితే - అదే నిజమైన త్యాగము. ప్రతిఫలాన్ని కోరి పనిచేస్తే అది

వ్యాపారము. క్రయవిక్రయాలకు అలవాటుపడిన మనుష్యులకు త్యాగము విలువ ఏమి తెలుస్తుంది? స్వార్థమే పరమార్థముగా జీవించే వాడికి భక్తి రుచి ఏమి తెలుస్తుంది? త్యాగము వలన పవిత్రత వస్తుంది. పవిత్రుడికి అసాధ్యమేముంది ఈ లోకములో? ఇంద్రియ విలాసమును నిరోధించినవాడే నిజమైన త్యాగి. త్యాగి నిరంతరమూ బ్రహ్మానందములో మునిగి ఉంటాడు. త్యాగి కానివాడు భోగమును విడిచిపెట్టలేడు - జ్ఞానమును సంపాదించలేడు - యోగి కాలేడు.

# 49. విద్య

విద్యలేనివాడికి వికాసము లేదు, వాడు శ్రేయస్సును పొందలేడు. విద్య గలవాడికి మాత్రమే మనస్సులోని అన్ని కోణములు వెలుగును చూస్తాయి. భుక్తిని, భక్తిని, ముక్తిని సంపాదించి పెట్టగలిగేది విద్య మాత్రమే. మరి విద్య ఎలా వస్తుంది? శ్రద్ధ వలన! కనుక శ్రద్ధగా విద్యను శ్రవణం చేయండి. వినకుండా ఎలా నేర్చుకుంటారు? నేర్చుకొనేది ఎప్పుడూ కొత్తగానే ఉంటుంది. అయినప్పటికీ మీరు ఓర్పుతో అభ్యాసము చేస్తే నేర్చుకున్న విద్య మీ హృదయానికి హత్తుకుంటుంది. విద్యమాత్రమే అవిద్య యొక్క అన్ని పొరలను తొలగించి కాంతిని చూపిస్తుంది.

మనకు పొట్టవుంది. కనుక ఏదో ఒక వృత్తి చేసుకొనక తప్పదు. కాని వృత్తి విద్యలన్నీ పొట్టకే పరిమితము. వృత్తి విద్యలు మానవుడిని అశాంతి నుండి విడుదల చేయలేవు. ఏ విద్య అయితే మనిషిని అజ్ఞానము నుండి విడుదల చేస్తుందో - అదే నిజమైన విద్య! అదే ఆత్మవిద్య! అదే రాజ విద్య! మానవుడికి భౌతిక విద్యలు ఎంత అవసరమో - ఆత్మ విద్య కూడా అంతే అవసరము. లోకములో సహృదయము కలవారందరూ ఆత్మ విద్యకు వారసులే! గారడీల వల్ల, మహిమల వల్ల ఆత్మ తెలియదు - ఒక్క ఆత్మ విద్యవల్ల మాత్రమే ఆత్మ అనుభవములోనికి వస్తుంది - ఆత్మ సుఖము తెలుస్తుంది.

## 50 ఏకాంతము

ఏకాంతమంటే అందరికీ భయం! మనమందర మూ ఒంటరిగానే ఈ లోకములోనికి వచ్చాము! మరల ఈ లోకాన్ని విడిచి వెళ్ళేటప్పడు కూడా ఒంటరిగానే వెళ్ళాలి. మీరు ఒంటరిగా ఉన్నప్పడే మీ మనస్సులోని బలహీనతలు ఏమిటో మీకు తెలుస్తాయి. రోగనిర్ధారణ చాలా ముఖ్యము - వైద్యము తరువాత! కనుక ఏకాంతవాసము అభ్యాసము చేయండి. మీ బలహీనతలు ఏమిటో మీరు తెలుసుకోండి. మీ బలహీనతలు చూసి భయపడకండి. సాధనవలన,

సజ్జన సాంగత్యము వలన, గురువు యొక్క అనుగ్రహము వలన, ఎంత బరువైన బలహీనతైనప్పటికీ బయటికి ఊడ్చ వచ్చును. కనుక గురువుతో మానసికమైన అనుబంధము అతిముఖ్యము. మీ బలహీనతలను భుజించగల శక్తి గురువుకు ఉంటుంది. ఏకాంత వాసము వలన - ఆలోచనా శక్తి, ధ్యానించగల శక్తి ఆరోజుకారోజు అభివృద్ధి అవుతాయి. దేహముయొక్క ఆరోగ్యమునకు ఉపవాసము ఎంత ముఖ్యమో - మానసిక వికాసమునకు ఏకాంత వాసము కూడా అంతే అవసరము. కాని హృదయములో మోహమున్న మనిషి ఒంటరిగా ఉండలేడు. మోక్షము పొందేవరకూ మోహము విడిచిపెట్టదు.

## 51. సత్పురుషుని సాన్నిధ్యము

కల్పవృక్షము, కామధేనువు కోరినవాటినే ఇస్తాయి - కాని సత్పురుషుని సాన్నిధ్యము కోరనివాటిని కూడా యిస్తుంది. సత్పురుషులను ఆశ్రయించి, అనుసరిస్తే మన హృదయము పండుతుంది. సజ్జన సాంగత్యము వలన ఈ లోకములో సాధించలేనిది ఏమీ లేదు. సత్పురుషుని సాన్నిధ్యము కోసము అవసరమైతే ప్రపంచపు అంచుల వరకు ప్రయాణము చేయమన్నాడు ప్రపంచ ప్రఖ్యాత సైంటిస్ట్ ఐన్‌స్టీన్! సహవాసము చేయుట కు

సమాజములో నీకు సత్పురుషుడు దొరకకపోతే అడవి లోని ఏనుగులాగ ఒంటరిగా బ్రతకమన్నాడు గౌతమ బుద్ధుడు! కడుపులో బాధవచ్చినా, కాలికి నొప్పి వచ్చినా, శరీరములో ఏ భాగమునకు బాధ కలిగినా కళ్లవెంట నీరు వస్తుంది. అదేవిధముగా సమాజములో ఎక్కడ కష్టము సంభవించినా సత్పురుషుని హృదయము క్షోభిస్తుంది. సత్పురుషులు లేని సమాజము ఉప్పులేని పప్పు వంటిది.

## 52. స్నేహము

ఈ లోకములో మనకు కనిపిస్తున్నవన్నీ స్నేహాలు కాదు - ఫ్రెండ్‌షిప్‌లు మాత్రమే! ఈ ఫ్రెండ్‌ను షిప్పు ఎప్పుడో ముంచివేస్తుంది. నిజమైన స్నేహము శ్రేయస్సును కోరుతుంది - త్యాగాన్ని చేస్తుంది. స్వార్థమే పరమార్థముగా, జీవితమే వ్యాపారముగా జీవిస్తున్న నేటి సమాజములో ఎదుటివారి శ్రేయస్సును కోరేవారు ఎందరు? పెద్ద పెద్ద సముద్రాలలో రాళ్ళు విసిరినా పరవాలేదు. కాని చిన్న చిన్న గుంటల్లో రాళ్ళు విసిరితే ఉన్న తేటనీరు కాస్తా బురదలై పోతుంది. మనము అందరము చిన్న చిన్న గుంటలలాంటి వాళ్లమే! ప్రకృతి మనుష్యులతో స్నేహం చేస్తే మీలోనున్న ఆ కాస్త భక్తికూడా జారిపోతుంది. పచ్చని పైరు చేనులో పశువు పడితే ఆ పైరును ఎలా పాడుచేస్తుందో - అదే

విధముగా దుష్టులతో స్నేహము చేస్తే మీలోని సద్గుణాలకు మిమ్మల్ని దూరము చేస్తారు - దురలవాట్లకు బానిసల్ని చేస్తారు, మూలములో పతనమైపోతారు. నీళ్ళు అన్నీ ఒక్కటే - అయినప్పటికీ తాగటానికి మాత్రము కొన్నే పనికివస్తాయి. అదేవిధముగా మనుష్యులందరూ ఒక్కటే - అయినప్పటికీ కొందరితోనే స్నేహము చేయండి. లౌకికులకు చేరువైతే మీ మనస్సు చిక్కబడుతుంది - దూరమైతే బాగుపడు తుంది. దుష్టుడు నిన్ను తరుముకు వస్తుంటే - ఎదురుగా పులి వస్తుంటే - నీవు ఆ దుష్టుని చేతిలో పడుటకంటే ఆ పులినోటిలో పడుటయే మంచిదన్నారు శ్రీమధ్వాచార్యులు! పులినోటిలో పడితే ఆ దేహమే పోతుంది. కాని దుష్టుడి చేతిలో పడితే దురలవాట్లకులోనై నికృష్ట జన్మలు వస్తాయి.

దుష్టులతో స్నేహము చేస్తే - వారు మిమ్ములను ప్రగతివైపు ప్రయాణము చేయనివ్వరు. మంచిని ప్రోత్స హించరు సరికదా "మాటలు వింటేనే సరిపోతుందా?" అని నిరుత్సాహపరుస్తారు. దీపం ఉండగా చదువుకోని కుర్రవాడు దీపం ఆర్పివేసిన తరువాత చదువుకుంటాడా? మనము శాస్త్రము వింటూ ఉంటేనే దారి దొరుకుటలేదు - అసలు వినని వాడికి దారి ఎలా తెలుస్తుంది? కనుక సాధ్యమైనంత వరకూ దుష్టులకు దూరముగా ఉండండి. ఎందుచేతనంటే దుష్టులు అకారణముగా మంచివారి

హృదయాలను గాయపరుస్తారు. దేహానికి తగిలిన గాయాలైతే స్మశానములోనే కాలిపోతాయి. కాని మనస్సుకు తగిలిన గాయాలు మానటానికి మరలా ఎన్నో జన్మలు పడుతుంది. దుష్టునితో సహవాసముకంటే మంచివారితో విరోధము మేలు చేస్తుంది.

# 53. ఆహారము

మనము బ్రతకటానికి అన్నము అవసరమే! అయినప్పటికీ మనము బ్రతుకుట కోసమే తినాలి గాని - తిండికోసమే బ్రతకకూడదు. ఆకలికూడా ఒక రోగమే! రోగానికి సరిపడిన మందునే ఎలా మింగుతామో - అదే విధముగా ఆకలికి సరిపడిన అన్నమే తినాలి. మనము తినే ఆహారము, మనము చదివే పుస్తకాలు, మనము చేసే స్నేహాలు, మనము చూసే సినిమాలు, మనము పుట్టి పెరిగిన కుటుంబము, మన పరిసరాలు, వాతావరణము తీసుకువచ్చే మార్పులు - వీటి అన్నింటియొక్క ప్రభావము మన మనస్సు మీద ఉంటుంది.

గీతలో వాసుదేవస్వామి యుక్తాహారమని చెప్పాడు. అంటే మీకు తగిన ఆహారాన్నే తినమని చెప్పాడు. శ్రీరమణస్వామి మీకు హితవైనదే - మితముగా తినమన్నాడు. మనము తినే ఆహారము యొక్క ప్రభావము

మన మనస్సు మీద కొంతవరకు ఉంటుంది. సాత్వికాహార ము తీసుకుంటే సత్వగుణము పెరుగుతుంది. సత్వ గుణము సత్యాన్ని తెలుసుకొనుటకు దారి చూపుతుంది.

నియమాల పేరుమీద, నమ్మకాల పేరుమీద, సాంప్రదాయాల పేరుమీద, సత్యమును తెలుసుకొనే మార్గమును విడిచిపెట్టకూడదు. మన దేహము అన్నము వలన వచ్చినది - అన్నము తింటే పెరుగుతున్నది - అందుకే దీనిని అన్నమయ కోశము అన్నారు. కనుక ఆధ్యాత్మిక రంగములో ఆహార నియమముకూడా కొంతవరకూ అవసరమే. ఆహార విహారాలలో జాగ్రత్తగా ఉంటే మీ బుద్ధి వికసిస్తుంది. కాని కేవలము ఆహార నియమము వలననే జ్ఞానము వస్తే - ఆహార నియమమును పాటించేవారంద రికీ ముందు జ్ఞానము రావాలి. మరి ఎవరికైనా జ్ఞానము వచ్చినదా?

# 54. బ్రహ్మచర్యము

మన స్వరూపము బ్రహ్మమే! బ్రహ్మములో నిరంత రమూ చరించుటయే బ్రహ్మచర్యము. బాహ్య ఇంద్రియ ములను బంధించినంత మాత్రము చేత అది బ్రహ్మచర్య ము కాదు. శ్రీ కృష్ణుడు వివాహము చేసుకున్నాడు - భీష్ముడు చేసుకోలేదు. కాని శ్రీకృష్ణుడికి ఉన్న బ్రహ్మ

చర్యము భీష్ముడికి లేదు. అందుకే శ్రీ కృష్ణుడిని నిత్య బ్రహ్మచారి అన్నారు. ఆత్మను తెలుసుకొనుటకు ఇంద్రియ నిగ్రహము అవసరమే. కాని కేవలము బాహ్యేంద్రియము లను బంధించినంత మాత్రము చేతనే ఆత్మ తెలియదు. ఆత్మను తెలుసుకొనుటకు పెండ్లి అనేది ప్రతిబంధకము కాదు. మరి మనము పూజించే రాముడు గృహస్తు కాదా? కృష్ణుడు గృహస్తు కాదా? మన ఋషులలో ఎందరు గృహస్తులు లేరు? కనుక పెండ్లి చేసుకుంటే సత్యము తెలియదని మీరు ఎవ్వరూ భయపడకండి. భ్రమపడకండి. స్త్రీ పురుష సంబంధము కూడా ఒక తలంపే. మీరు నిరంతరమూ ఆత్మను చింతిస్తూంటే అన్ని తలంపులతో పాటు ఆ తలంపు కూడా రాలిపోతుంది. తలంపులే మన నిశ్చలస్థితికి అడ్డువస్తున్నాయి. మీరు భార్యాబిడ్డలను విడిచి పెట్టి అడవులకు వెళ్ళినంత మాత్రముచేత మీకు ఆత్మ తెలియదు. మీ మనస్సు అనే సమస్యను మీరు పరిష్కరిం చుకోండి. ఇంటి దగ్గర అన్ని పరిస్థితులూ అనుకూలముగా ఉన్నప్పడు మీ మనస్సును మీరు పరిష్కరించుకోలేకపోతే అడవులకు వెళ్ళి పరిష్కరించుకోగలరా? జీవితము సమగ్రముగా వికసించుటకు బ్రహ్మచర్యాశ్రమము, గృహస్తాశ్రమము, వానప్రస్థాశ్రమము, సన్యాసాశ్రమము అని జీవితమును నాలుగు భాగములుగా మన పూర్వులు

విభజించినారు. గృహస్తాశ్రమములో ఉన్నవారు మిగిలిన వారికి సహాయ సహకారములను అందించవలసి యున్నది. కాని ఆత్మ వీటన్నిటికంటే అతీతమైనది!

# 55. ధనము

భగవంతుడు మాయనంతా మూటగట్టి డబ్బులో పెట్టాడని వాల్మీకి మహర్షి రామాయణములో చెప్పాడు. మనిషికి ధనము అవసరమే - కాని ధనము వలన జ్ఞానము రాదు. ఆత్మ సుఖమును మీరు ధనముపెట్టి కొనలేరు. ధనము వలన ఏ ప్రయోజనము వస్తుందో - దానిని మాత్రమే అది సాధించగలదు. ధనము వలన, జనము వలన సంఘములో మీ స్థాయి పెరగవచ్చును. మీరు ధనమును ఆరాధిస్తూ జీవితగమ్యమైన సత్యమును తెలుసుకోలేరు. సత్యమును ఆరాధిస్తే అది సాక్షాత్కరి స్తుంది. ధనము మానవ కల్పితముగాని - సత్యము మాత్రము మానవ కల్పితము కాదు. మీరు ధనముపెట్టి భోగాన్ని కొనుక్కోగలరేగాని - శాంతిని సంపాదించలేరు. శాంతి ఒక్క ఆత్మలోనే ఉంది. అశాశ్వతమైన ఈ ప్రపంచ ములో శాశ్వత సుఖము కోసము వెదికితే అది దొరుకు తుందా? ధనము వలన వచ్చే భోగము అశాశ్వతము మాత్రమే కాదు - అది గతిని కూడా నిరోధిస్తుంది. ధనము

వలన మోక్షము వస్తే - మనకంటే ముందుగా ఈ లోకము లో నున్న ధనవంతుల కందరికీ మోక్షము రావాలి. కాని ఏ ధనవంతుడికైనా మోక్షము వచ్చినదా?

అంత మాత్రముచేత ధనానికి విలువ లేదని కాదు. మీరు సత్వగుణముతో దానముచేస్తే - మీ మనస్సు లోని దోషములు రాలిపోయి - మీరు పవిత్రులౌతారు - మీకు పుణ్యలోకాలు వస్తాయి. మీరు మంచి కోసము ఖర్చుపెట్టిన డబ్బు వృధా అయిపోతుందేమోనని మీరెవ్వరూ బాధపడకండి. అది మరుజన్మకు కూడా మీ వెంట వస్తుంది - మీకు ఉన్నత జన్మ లభిస్తుంది.

పూర్వ జన్మలో మీరు చేసిన పుణ్యాలనుబట్టి ఒకవేళ మీకేదైనా అదృష్టము రావచ్చును - దానిని చూసు కొని మీరు గర్వముతో గంతులు వేయకండి. అది కూడా ప్రమాదములో పడుటకు దారితీస్తుంది. ధనమును నిగ్రహించుట నేర్చుకోవాలి. నిగ్రహించుకోలేకపోతే మీరు ఎంతైతే పొంగిపోతున్నారో - భవిష్యత్తు జన్మలలో అంత కృంగిపోతారు. నాలుగు రోజులు గడిస్తేనే మీరు గట్టెక్కి పోయామని అనుకోవద్దు. ధనముకంటే గుణము గొప్పది. గుణమును ధనముపెట్టి కొనలేరు. గతించిన రోజులలో ఒక్క రోజును కూడా మీ ధనము వెనుకకు తీసుకు రాలేదు. మరి ధనమును చూసుకొని ఎందుకు గర్వపడాలి?


# 56. నిద్ర - మరణము

గాఢనిద్రలో మీ దేహములేదు, లోకములేదు, దేవుడులేడు, మనస్సులేదు - అయినప్పటికీ మీరు సుఖముగా ఉన్నారు. కాని మీరు నిద్రలో సుఖముగా ఉ న్నామనే సంగతి అప్పడు మీకు తెలియదు - మెలుకువ వచ్చిన తరువాత మాత్రమే తెలుస్తున్నది. ఆ నిద్రలోనున్న సుఖాన్ని మీరు మెలకువలో నుండగా అనుభవములోనికి తెచ్చుకోగలిగితే - మీకు ఆనందానుభవము కలుగుతుంది - అదే మోక్షము. మీరు గాఢనిద్రలో నుండగా మీ దేహము తోటి, లోకముతోటి మీకు ఉన్న సంబంధము తెగిపోతున్న ప్పటికీ - మీకు నిద్రంటే భయములేదు - కాని మరణమంటే భయపడుతున్నారు - ఎందుచేత? నిద్రలేచిన తరువాత మీ దేహము, మీ సంసారము, మీ సంపదలు, మీ ప్రపంచ ము మీకు కనిపిస్తున్నాయి. ఇది మీ అనుభవములో ఉంది. కనుక నిద్రంటే ఎవరూ భయపడరు. కాని మరణముకూడ ఒక దీర్ఘ నిద్రలాంటిదే! మరణము కూడా ఒక తలంపే! మార్పును తెచ్చేదే మరణము! ఈ దేహము మరణిస్తే - మరొక కొత్త దేహములోనికి, కొత్త పరిసరాల లోనికి మారతారు. అంతేగాని మీరేమీ మారరు - మీరు మీరుగానే ఉంటారు.

శ్వాస ఆగిపోతే ఈ శరీరవే ఒక శవం! ప్రాణముండగా ఎవడి శవాన్ని వాడే మోస్తున్నాడు - ప్రాణము పోతే నలుగురు మోస్తారు! అంతేతేడా! హృదయములో నున్న కోరికలనన్నింటినీ మూటకట్టుకొని జీవుడు బయటికిపోయిన వెంటనే ప్రాణము పోతుంది.

స్మశానమంటే అందరూ భయపడతారు. కాని స్మశానము కూడా మన తల్లివంటిదే! ఓతల్లి కడుపులో నుంచి బయటకు వచ్చిన శరీరాన్ని - ప్రాణము పోయిన తరువాత స్మశానము తనలో దాచుకుంటుంది. పంచ భూతములతో తయారైన ఈ దేహాన్ని స్మశానములో దహనము చేసినప్పడు - పంచభూతములు విడిపోయి, మరల పంచభూతములలో కలిసిపోతాయి.

స్వప్నములో మనము జీవించే జీవితాలు పొట్టి జీవితాలు - మనము మెలుకువలో జీవిస్తున్నవి పొడుగు జీవితాలు. కలలో అనుభవించేది సూక్ష్మశరీరము - జీవితములో అనుభవించేది స్థూల శరీరము - అంతే తేడా!



# 57. నిజమైన చావు పుట్టుకలు

మీ దేహము పుట్టినప్పడు మీరు పుట్టలేదు. మీ దేహము మరణించినప్పడు మీరు మరణించుటలేదు. "నేను" అను తలంపు ఎప్పడు పుట్టినదో అప్పడే మీరు పుట్టారు. మరల ఈ "నేను" అనుతలంపు ఎప్పడు ఆత్మలో లయమవౌతుందో - అప్పడే మీరు మరణిస్తారు. అహంకారము యొక్క పుట్టుకే నిజమైన పుట్టుక - అహంకారము యొక్క చావే నిజమైన చావు. అంతేగాని ఈ దేహము యొక్క పుట్టుక పుట్టుకా కాదు - మరణము మరణమూ కాదు.

ఎన్నో జన్మలనుండి అహంకారము బాహ్యముగా తిరుగుతున్నది. సాధన చేసి దానిని లోపలికి త్రిప్పి, దాని మూలమును అన్వేషించుటయే నిజమైన ఆధ్యాత్మిక జీవితము. మీరు బాహ్యముగా మైళ్ళ దూరము ప్రయాణము చేయుటకంటే ఒక్క అంగుళము మీ హృదయములోనికి దిగండి. ఆత్మ యొక్క అంతస్తు ఏమిటో మీకు అప్పడు తెలుస్తుంది. ఆత్మసుఖము మీకు రుచి దొరికేవరకూ - ఈ విషయ వాసనలు మిమ్ములను విడిచిపెట్టవు - మీరు ఈ ప్రకృతి మైకములో నుంచి బయటపడలేరు. విగ్రహములను పూజించుట వలన,

మంత్రములను జపించుటవలన అహంకారమును నిద్రపుచ్చవచ్చునేమోగాని - అహంకారమును తొలగించు కోలేము. మీ శక్తిని, మీ యుక్తిని ఉపయోగించి అహంకారము యొక్క ఆదిని చూడగలిగితే - ఆత్మ వ్యక్తమౌతుంది.

# 58. మతము

మతము అనేది మనస్సు యొక్క సృష్టి. మతిలో నుంచి పుట్టినది గనుకనే మతము అన్నారు. ఈ ప్రపంచములో హిందూమతము, క్రైస్తవ మతము, బౌద్ధ మతము, ఇస్లాం మతము మాత్రమే కాదు - బుర్రకొక మతముంది. మతాల పేరు మీద మానవ జాతికి మేలు కంటే కీడే ఎక్కువ జరుగుతున్నది. పూర్వము మతాల పేరుమీద ఎన్నో యుద్ధాలు జరిగాయి. ఎంతో రక్తపాతము జరిగినది. మతము వలన మత్తు వస్తుంటే ఆ మతము అనవసరము. మానవులను వివేకవంతులుగా తయారు చేయుటకే మతము గాని - మతము మత్తులో పెట్టి మనుష్యులను బానిసలుగా మార్చి, దోచుకోవటానికి కాదు. మార్గము చూపి, మతిని బాగుచేసేదే మతము!

ఈ మతాలు పుట్టకముందు కూడా ఆత్మ ఉంది! ఆ ఆత్మను తెలుసుకునే మార్గమును చూపించుటకే ఈ

మతాలు పుట్టినవి. మనిషి యొక్క జీవిత గమ్యాన్ని మోక్షము మీదకు గురిపెట్టించలేకపోతే - ఆ మతము అనవసరము. లోకకళ్యాణము కోసము పాటుపడని మతము - మతమే కాదు. ఎవరి మతాన్ని వారు, ఎవరి దేవుళ్ళను వారు గౌరవించుకోవచ్చును - తప్పలేదు. కాని ఎదుటివారి మతాన్నిగాని, దైవాన్నిగాని ద్వేషించకూడదు. రూపాయి మీ దగ్గర ఉన్నా - నా దగ్గర ఉన్నా దాని విలువ రూపాయే!

ఉన్నది ఆత్మ ఒక్కటే! ఆత్మ లేకుండా - దేవుడు లేడు, జీవుడు లేడు, లోకములేదు. కాని దురదృష్టమేమి టంటే - ఈ లోకములో మతాల పేరుతో, విగ్రహారాధన పేరుతో సమాజాన్ని దోచుకుంటున్నారు. పదవుల కోసమో, ప్రాబల్యం కోసమో ఆవేశాన్ని పెంచి, వివేకాన్ని చంపి, మతము మత్తులో పెట్టి, మనుష్యులను వాడుకుంటున్నారు. మనిషిని, మనిషిని వేరుచేస్తున్న ఈ మతాల అడ్డుగోడలను అధిగమించి, అమృత వస్తువును అందుకున్నవాడే నిజమైన తెలివిగలవాడు. వాడు మాత్రమే సత్యవస్తువును తెలుసు కుంటాడు. సత్యము తలంపు కాదు. అది ఒక అభిప్రాయము కూడా కాదు. మన తలంపులు, మన అభిప్రాయాలే సత్యమును తెలుసుకొనుటకు అడ్డు వస్తున్నాయి. సత్యానికి మించిన మతము లేదు. సత్యానికి

మించిన జాతి లేదు. సత్యానికి మించిన దేవుడు లేడు. మతాన్ని మార్చుకుంటే మీరు సుఖపడరు - మతాన్ని దాటండి! మారు మనస్సు పొందండి - మోక్ష సుఖం మీ చేతికి అందుతుంది.

# 59. సమాజము

మానవుడు సంఘజీవి. వ్యక్తుల సమూహమే సమాజము. వ్యక్తులు బాగుపడితేనే సమాజము బాగు పడుతుంది. మనిషి తన స్వార్థాన్ని విడిచిపెడితే సమాజ ము ఉద్ధరింపబడుతుంది. స్వార్థమున్న మనిషికి పరమార్థ ము తెలియదు. మీరు స్వార్థాన్ని విడిచిపెట్టకుండా సమాజాన్ని విడిచిపెట్టి అడవులకు వెళ్లినంతమాత్రముచేత సత్యము తెలియదు. సాటిమనిషి సుఖం కోసము ఎవడయితే జీవిస్తున్నాడో - వాడే మహాత్ముడు! సోంబేరి తనమును విడిచిపెట్టి, వ్యక్తి తాను చేసిన పనియొక్క ఫలితాన్ని సమాజానికి నివేదిస్తే - అదే నిజమైన పూజ! కళ్ళ ఎదుట కనిపిస్తున్న సాటిమనిషిని ప్రేమించలేనివాడు కళ్ళకు కనిపించని ఆ దేవుణ్ణి ప్రేమిస్తున్నానంటే - ఆ ప్రేమ నిజమైనదేనా? నిస్వార్థమైనదేనా? వ్యాపార భక్తికి భగవంతుడు తెలియబడడు. నరరూపములో ఉన్నది కూడా నారాయణుడే! మానవసేవే మాధవసేవ!

సమాజానికి శీలము ఆభరణము వంటిది. శీలము వలన శక్తి వస్తుంది. శీలము లేని జాతికి ప్రగతి లేదు. సమాజములో అజ్ఞానము ఉన్నంతకాలమూ - ఏదో రూపములో దారిద్ర్యము, హింసా ప్రవృత్తి, అశాంతి వెంటాడతాయి.

అజ్ఞానము నుండి విడుదల పొందుటకు గురువు సహాయము అవసరము. మీ ప్రవృత్తిని బట్టి మీకు నచ్చిన గురువును మీరు ఎన్నుకోండి. అయితే ఆ గురువు కరుణా మూర్తి, జ్ఞానమూర్తి, ప్రేమమూర్తి అయి ఉండాలి. సత్యాన్వేషణలో మీ గురువు ఎంతవరకూ మీకు సహక రిస్తున్నాడో గమనించండి. మీ గురువు చెప్పినది వినుటయే కాకుండా - ప్రశ్నించుట కూడా నేర్చుకోండి. ఆత్మ విద్యను శ్రవణము చేయకుండా, మననము చేయకుండా అజ్ఞానము ఆరదు. కోరికలు మారినంత మాత్రము చేత అజ్ఞానము విడిచిపెట్టదు. అజ్ఞానముతో పాటు కర్మలు, జన్మలు, బంధములు, శోకములు ఉండనే ఉంటాయి. అజ్ఞానమును అజ్ఞానముతో జయించలేము. అందువలన జ్ఞానిని ఆశ్రయించి, సేవించి, గౌరవించి, ఆయన అనుగ్రహమును పొందితే - అజ్ఞానము వేరుతో సహా తొలగిపోతుంది.

జ్ఞానము మీరు సంపాదిస్తే వచ్చేది కాదు - అది

సిద్ధముగానే ఉంది. మీరు సాధన చేసే అజ్ఞానమును పోగొట్టుకుంటే ఉన్న జ్ఞానము వ్యక్తమౌతుంది. మరి మీరు జీవించి యుండగా అజ్ఞానమును ఎలా తొలగించు కోవాలో నేర్చుకోకపోతే - మరణానంతర జీవితములో ఎలా నేర్చుకుంటారు?

# 60. రమణోపనిషత్తు

మానవుడు తాను బ్రహ్మమైయుండి, ఆ బ్రహ్మము తనహృదయములో ఆత్మరూపమున స్వయముగా ప్రకాశిస్తుండగా - ఆత్మను తెలుసుకొనుటకు హృదయమును శోధించుటమాని, శాస్త్రములను శోధిస్తున్న మానవమానసమును హృదయమువైపు గురిపెట్టించుటకు "నేనెవడను?" అను విచారణ పద్ధతిని బోధించి ఒక నవ్యమార్గాన్ని శ్రీ రమణాచార్యుడు ఆవిష్కరించారు. అదే ఈ "రమణోపనిషత్తు".

సృష్టి ప్రారంభమైనప్పటినుంచి మానవుడు చేస్తున్న ప్రయత్నము ఒక్కటే - దుఃఖస్పర్శలేని సుఖము కోసం తపనపడుతున్నాడు. దేవుడిని తెలిసికొనుట కూడా అందులో ఒక భాగముమాత్రమే. కాని నిజమైన సుఖము ఎక్కడఉందో తెలిసేవరకు మానవుడు దుఃఖములో నుంచి బయటపడలేడు. మరి ఆ నిజమైన సుఖం

ఎక్కడవుంది?

ఒక్క ఆత్మలోతప్ప ఈ సృష్టిలో సుఖము ఎక్కడా లేదు. ఉన్నది ఆత్మ ఒక్కటే. అది అనంతము, అఖండము, అమరము, అజరము, అద్వితీయము, అనిర్వచనీయ ము, అవ్యయము, అభవము, అభౌతికము, అలౌకికము, అది సత్‌చిత్‌ఆనంద స్వరూపము. సినిమాబొమ్మలకు తెర ఎలాఆధారమో - ఈ సృష్టికి ఆత్మే అధారము. దానిని నీరు తడుపలేదు - నిప్ప కాల్చలేదు - గాలి కదుపలేదు. దానికి పుట్టుకాలేదు - మరణమూ లేదు. దానికి ఆదీ లేదు - అంతమూ లేదు. అది కాలాతీతము - ఊహాతీతము - గుణాతీతము. అది మీకు దూరాన ఎక్కడోలేదు - మీ స్వరూపముగానే ఉంది - మీ హృదయములోనే ప్రత్యక్షముగా ప్రకాశిస్తున్నది.

మీ స్వరూపాన్ని మీరు మరచిపోయి - పుట్టి, పెరిగి, గిట్టే ఈదేహమే మీరని భ్రమపడుతున్నారు - అందుకే దుఃఖపడుతున్నారు. మీస్వరూపము మీకు తెలిసేవరకు మీరు దుఃఖములోనుంచి బయటపడలేరు.

మీ స్వరూపము మీఅనుభవములో లేదు - కాని మీరు "నేను, నేను" అని అంటున్నారే - ఈ "నేను" మీ అనుభవములో వుందికదా? దీనిని గురించి మీరెప్పడైనా ఆలోచించారా?

మీ గాఢనిద్రలో మీ "నేను" గొడవ మీకు ఉందా? మీ "నేను" లేనప్పుడు మీదేహంగొడవగాని, లోకంగొడవగాని, దేవునిగొడవగాని మీకువుందా? - లేదు. కాని నిద్రలోనుంచి మెలకువరాగానే మరల మీకు "నేను" అను తలంపు వస్తున్నది. ఆతలంపు వెనకాలే మీసంసారమంతా మీకు గుర్తుకువస్తున్నది - మీకు దుఃఖాన్ని తీసుకువస్తున్నది.

నిజమనేది ఎప్పడూ ఉంటుంది - అది ఒకటి గానే ఉంటుంది - అందులోనుంచి సుఖము వస్తుంది.

మరి మీరుఅంటున్న "నేనే" కనుక నిజమైతే - అది మీగాఢనిద్రలో ఎందుకు ఉండుటలేదు? మీరు అంటున్న "నేనే" గనుక నిజమైతే దానికి రాగం ఎందుకు వస్తున్నది - ద్వేషం ఎందుకు వస్తున్నది - కామం ఎందుకు వస్తున్నది - లోభం ఎందుకు వస్తున్నది - దుఃఖం ఎందుకు వస్తున్నది? అది ఎప్పడూ ఒకటిగా ఎందుకు ఉండలేకపోతున్నది?

మీరుఅంటున్న "నేను" నిజముకాదు - అందుకే అది క్షణక్షణం మారుతున్నది - మీకు దుఃఖాన్ని తెస్తున్నది.

గాఢనిద్రలో మీదేహగతమైన "నేను" లేదు - అయితే అప్పడు మరి మీరులేరా? మీరు లేకపోతే మెలుకువరాగానే "నాకు సుఖముగా నిద్రపట్టినది" అని

ఎవరు చెపుతున్నారు? ఆ సుఖాన్ని మీరు అనుభవించి చెపుతున్నారా - లేక అనుభవించకుండానే చెపుతున్నారా? మరి గాఢనిద్రలో సుఖముగావున్న ఆ "నేను" ఎవరు? - అదే ఆత్మగతమైన అసలు "నేను". ఆ "నేను" ఎప్పుడూవుంది - మీ మెలుకువలోనూవుంది. కాని అది మీఅనుభవములోనికి రాకుండా మీ దేహగతమైన "నేను" మీకు అడ్డుపడుతున్నది.

గాఢనిద్రలో మీరు సుఖముగా ఉన్నారు - కాని ఉన్నసంగతి మీకు తెలియుటలేదు. జాగ్రదవస్థలో మీరు ఉన్నారని మీకు తెలుస్తున్నది - కాని సుఖముగా మాత్రములేరు. ఆగాఢ నిద్రలోనున్నసుఖాన్ని మీరు ఎరుకలోనుండగా అనుభవములోనికి తెచ్చుకోగలిగితే - అదే మోక్షం! మోక్షమనేది సంపాదిస్తే వచ్చేదికాదు - అది ఎప్పుడూవుంది. మీరు మోక్షాన్ని కోరుకునేటప్పుడు కూడా మీరు మోక్షములోనే వున్నారు. మీ స్వరూపమే మోక్షం. మీస్వరూపసుఖాన్ని మీరు అనుభవించకుండా మీ దేహగతమైన "నేనే" మీకు అడ్డుపడుతున్నది. మీ కష్టాలకు, నష్టాలకు కారణమైన మరి ఈ "నేను" ఎవరు?

దేహము జడము - దానికి "నేను" అని చెప్పగల శక్తిలేదు. ఆత్మచైతన్యము - దానికి పుట్టుకలేదు. మరి ఈ నేను ఎవరు?

చైతన్యమైన ఆత్మను - జడమైన దేహమును కలిపి ముడిపెడుతూ రెండింటికిమధ్యన దేహపరిమిత మైన "నేను" ఒకటి పుట్టుచున్నది - అదే చిజ్జడగ్రంథి - అదే అహంకారము - అదే అజ్ఞానము - అదే జీవుడు - అదే కారణశరీరము.

ఈ "నేను" నిజముకాదు - అది కేవలము ఒక తలంపుమాత్రమే! మనకు వచ్చుతలంపులలో ఈ "నేను" అనునది ప్రథమతలంపు, ప్రధానతలంపు, పునాదితలంపు, ఈ "నేను" అను తలంపునకే మిగిలిన తలంపులన్నీ వచ్చుచున్నవి - ఆ తలంపులమూటే మనస్సు!

ఈ "నేను" దేహపరమైనదే! ఐనప్పటికీ అది దేహము మరణించినప్పడు మరణించదు. దాని మూలమును అది చూసేవరకూ అది నశించదు. మరి దానిమూలము ఎక్కడవుంది?

ఈ "నేను" అను తలంపు మన లోపలనుంచే వచ్చుచున్నది. అందుకే ప్రతీమనిషి "నేను, నేను" అని ఛాతీమీద కుడివైపు క్రిందిభాగములోనే చేయి వేసుకుంటాడు. అంటే ఆ "నేను"కు మూలం అక్కడనే వుంది - అదే ఆధ్యాత్మికహృదయం!

ఆహృదయములో బ్రహ్మము నిరంతరము "నేను, నేను" అని స్వయముగా ఆత్మరూపమున ప్రకాశిస్తున్నది.

అదే నిత్యమైన సత్యమైన ఆత్మగతమైన అసలు "నేను"! నీటిలోనుంచి బుడగవచ్చినట్లు - ఆత్మ గతమైన ఈ అసలు "నేను"లోనుంచే దేహపరిమిత మైన "మిధ్యానేను" పుట్టుచున్నది. సూర్యకాంతినుంచి వెలువడిన ఒకానొక కాంతి కిరణమువలె - ఆత్మ శక్తి నుంచి వెలువడిన ఒకానొక అతిశయశక్తే ఈ "మిథ్యా నేను". కాని అది దానిమూలమును మరిచిపోయి తాను స్వయంభవుణ్ణి అనుకొని స్వతంత్రముగా వ్యవహరిస్తున్నది. ఈ "నేను" అను ఒంటిస్థంభము మీదనే ఈసృష్టి అంతా ఆధారపడియున్నది. ఈ "నేను" పుట్టినప్పడే జీవుడు పుట్టాడు - మరల ఈ "నేను" మరణించినప్పడే జీవుడు మరణిస్తాడు. ఈ "నేను" అను తలంపు పుట్టకముందు ఉన్నస్థితియే మనుము ఆదిగా ఉన్నస్థితి. ఈ "నేను" అను తలంపు కొంచెము కూడా లేనిచోటనే స్వరూపమువుంది.

"నేను" ఆత్మ - "నేను" అను తలంపు అహంకార ము. ఆత్మ అనంతమైనది - అహంకారము దేహపరిమిత మైనది. ఆత్మ సముద్రమైతే - అహంకారము బుడగ వంటిది. బుడగలేకుండా సముద్రము ఉండగలదు. కాని సముద్రములేకుండా బుడగ ఉండలేదు. అదేవిధముగా అహంకారములేకుండా ఆత్మ ఉండగలదు - కాని ఆత్మ లేకుండా అహంకారము ఉండలేదు. అహంకారానికి

దేహము కావాలి, లోకము కావాలి, దేవుడు కావాలి. కాని దేహములేకుండా, లోకములేకుండా, దేవుడు లేకుండా ఆత్మ ఉండగలదు - అది స్వయంప్రకాశము.

"నేను దేహము లోపలవున్నాను - నాకు బయట లోకముంది - దేవుడు ఎక్కడో దూరాన వున్నాడు అని మనిషి భ్రాంతి పడుతున్నంతకాలము వాడిని ఆశ విడిచిపెట్టదు. ఆశ ఉన్నమనిషి ఫలితాన్ని ఆశించకుండా పనిచేయలేడు. ఫలితాన్నిఆశించి పని చేసినంతకాలము - ఆ పనిలోనుంచి వాసన (సంస్కారము) పుడుతుంది. ఈ వాసనలు హృదయ ములో బీజరూపమున దాగివుంటాయి. మరుజన్మలో మరల ఆ వాసనలలోనుంచి కోరిక (తలంపు) పుడుతుంది. ఆ కోరిక మరల పనిచేయిస్తుంది. ఆ పని వలన ఫలితము వస్తుంది. ఆ ఫలితమును అనుభవిస్తాడు. ఆ అనుభవములోనుంచి మరల వాసన పుడుతుంది. ఇది కర్మసముద్రము. కర్తృత్వబుద్ధి ఉన్నంతకాలమూ మానవుడు ఈ కర్మసముద్రాన్ని దాటలేడు - జననమరణచక్రములోనుంచి బయట పడలేడు.

హృదయములోనున్న వాసనలు నిశ్శేషముగా బయటకుపోకుండా ఏజీవుడూ జ్ఞానికాలేడు. జ్ఞాని కానివాడు దేవునిలో లయముకాలేడు. హృదయములో

ఒక్కవాసన మిగిలినప్పటికీ అది జన్మకు హేతువు అవుతుంది - మోక్షసుఖము మీ అనుభవములోనికి రాకుండా అది అడ్డుపడుతుంది. కోటలో శతృవులు ఉన్నంతకాలము కోట స్వాధీనమౌతుందా?

హృదయములోనున్న వాసనలు తలంపు రూపములో శిరస్సులోనికి వచ్చేవరకు మీహృదయము లో ఏకోరికలు (వాసనలు) దాగివున్నాయో మీకే తెలియదు. నెరవేర్చినకోరిక మరింతబలపడుతుంది - నిరోధించిన కోరిక చిక్కిపోయి రాలిపోతుంది. కనుక కోరిక ఉదయించగానే దానిని ఆచరణలో పెట్టకుండా - "ఈకోరిక ఎవరికి కలుగుచున్నది?" అని ప్రశ్నించుకోవాలి! అప్పడు "నాకు" అని తెలుస్తుంది. మరి కోరికవచ్చే "నేను ఎవడను?" అని విచారణ చేస్తే - అప్పటివరకు బాహ్యసుఖాలకోసం లోకాలవెంట తిరిగే మనస్సు ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరియై సమాధానము తెలియక తల్లక్రిందులై తనమూలమును శోధించుట మొదలుపెడుతుంది.

## "నేనెవడను?"

పంచభూతములతో తయారైన ఈదేహము నేనా? ఈదేహమే గనుక నేనైతే - ప్రాణము పోయిన

తరువాతకూడా ఈదేహము (శవము) "నేను ఉన్నాను" అని అనాలిగా? ఏ శవమైనా అలా అంటున్నదా? దేహము జడము - దానికి మాటలాడే శక్తిలేదు. కనుక జడమైనదేహము నేనెట్లుకాగలను? దేహము నేను గాకున్న మరి నేనెవడను?

"కర్మచేసే కర్మేంద్రియములు నేనా? లేక విషయములను గ్రహించు జ్ఞానేంద్రియములు నేనా? దేహమే నేనుగానప్పుడు - మరి దేహములో భాగమైన ఈఇంద్రియములు నేనెట్లుకాగలను? ఇంద్రియములు నేనుగాకున్న మరి నేనెవడను?

"ప్రాణము" నేనా? ప్రాణమేగనుక నేనైతే - చివరి శ్వాస గాలిలో కలిసిపోయిన తరువాతకూడా "నేను ఉన్నా"నని నాకు తెలియాలికదా? నాఉనికి నాకు తెలియనప్పడు ఆప్రాణము నేనెట్లుకాగలను? ప్రాణము నేనుగాకున్న మరి నేనెవడను?

"మనస్సు"ను నేనా? మనస్సేగనుక నేనైతే - అది నిత్యమూ (జాగ్రద, సుషుప్తి, స్వప్నావస్థలలో) ఉండాలి కదా? కాని గాఢనిద్రలో (సుషుప్తిలో) మనస్సు ఉండుట లేదు. మరి గాఢనిద్రలో దాని అస్తిత్వాన్ని కోల్పోతున్న మనస్సును నేనెట్లుకాగలను? మనస్సును నేనుగాకున్న మరి నేనెవడను?

"అయితే గాఢనిద్రలో మనస్సు లేనప్పుడు మరి నేనులేనా? గాఢనిద్రలోగనుక నేనులేకపోతే నిద్ర నుంచి మేల్కొన్న తరువాత నాకు సుఖముగా నిద్ర పట్టినదని నేనెట్లు చెప్పగలుగుతున్నాను? గాఢనిద్రలో కూడా నేను ఉన్నానుగాబట్టే, సుఖాన్ని అనుభవిస్తున్నాను గాబట్టే - "నాకు సుఖముగా నిద్రపట్టినది" అని చెప్ప గలుగుతున్నాను. మరి గాఢనిదలో సుఖముగా ఉన్న ఆ "నేను ఎవడను?".

ఆ నేనే నిజమైన **"నేను"**! అదే చైతన్యము! అదే ఆత్మ! అదే బ్రహ్మము!

ఆ నేను మన మెలుకువలోను, నిద్రలోను, స్వప్నములోను సమానముగానే ఉంది. కాని అది మన అనుభవములోనికి రాకుండా మన పరిమితబుద్ధే (దేహము నేను అన్న భావనే) మనకు అడ్డుపడుతున్నది.

మనము ఎప్పుడైతే "నేనెవడను?" అని విచారణ మొదలుపెట్టామో - అప్పుడు మన దేహగత మైననేను మనస్సునుంచి విడివడి అంతర్ముఖమై తన మూలమును శోధిస్తూ హృదయమువైపు ప్రయాణము చేస్తుంది. అప్పడు మనస్సులోనికోరికలు విజృంభించు టకు ఆధారములేక, అవకాశముచిక్కక, వాటివేగము తగ్గి, క్రమముగాచిక్కి, సన్నగిల్లి రాలిపోతాయి. కోరికలు తగ్గినకొలదీ మన దేహగతమైన "నేను" హృదయములో

నిలకడగా ఉండగలుగుతుంది - దానికి ఆత్మరుచి అందుతుంది.

రూపాయి ఉన్నవాడిచేతికి వందరూపాయ లిచ్చి, ఆరూపాయిని క్రిందపారవేయమంటే ఎలా పారవేస్తాడో - అదే విధముగా భౌతికమైన క్షణిక సుఖాలను మరగిగివున్న మనమనస్సు అభౌతికమైన ఆత్మ సుఖాన్ని ఎప్పడైతే రుచిచూసినదో - వెంటనే మన మనస్సు ఆగిపోతుంది - ఆత్మలో అణిగిపోతుంది - తన ఉనికినే కోల్పోతుంది. అంత - సముద్రములో లేచిన అలలు సముద్రములోనే అణిగిపోయినట్లు - మన దేహగతమైననేను దాని మూలములో అణిగిపోయి - అహంవృత్తి నశించి - వెంటనే అహంస్ఫురణ కలుగు తుంది. ఆత్మగతమైన "**నేను**" తానుగా వ్యక్తమౌతుంది. ఏ సుఖాలకోసమైతే భ్రమపడి మనము బాహ్యంగా పరుగెడుతున్నామో - ఆ సుఖమే మనమౌతాము.

"నేను ఎవడను?" అను విచారణ మహా వ్రతము, విజృంభిస్తున్న మనస్సు అనే మదపుటేనుగు నకు - "నేను ఎవడను?" అను ప్రశ్న అంకుశము వంటిది. "నేను ఎవడను?" అను ప్రశ్నను అభ్యాసము చేయగా చేయగా - అది అన్నితలంపులను నాశనము చేసి -


శవమునుదహించు కొఱివికట్టెవలె చివరకు ఈ "నేను" అను తలంపుకూడా కాలిపోయి రాలిపోతుంది. మీ "నేను" పోతే మిగిలింది మీరే!

## మీ స్వరూపమే సుఖం!

మిగిలిన జీవులకు లేనిబుద్ధిని భగవంతుడు మనకు ప్రసాదించాడు - ఎందుకు? ఆలోచించమని! కనుక ఆలోచించండి! మీ సొంతబుద్ధిని విడిచిపెట్ట కండి! ఆలోచనే అమృతం! ఆలోచిస్తే మీరు అమృత మూర్తులౌతారు - దుఃఖ సాగరాన్ని దాటిపోతారు - శాంతి శిఖరాలను చేరుకుంటారు.

## తత్వమసి!




Ananya Graphics, Palakol
సత్ చిత్ ఆనంద సంగమమ్